# సౌందరనందం

వేదంలాంటి వెన్నెల విరియగాస్తూ ఉంది. కీచురాళ్ళ చప్పుడు, దూరంగా నక్కకూత, పొన్నాయి చెట్టుమీద పక్షి రెక్కలు విరుచుకొన్న ధ్వని, విని —

ఆనందస్వామి గాఢంగా నిశ్వసించాడు. ఓ సారి దుప్పటిని మెడదాకా లాక్కొని, కళ్ళు మూసుకున్నాడు. నిద్రపోవాలని స్వామి గారు, మూడు గంటలనించీ ప్రయత్నిస్తున్నారు. నిద్ర రాదు. కనీసం వచ్చే సూచనలు గూడా లేవు. నిద్రపోయేందుకు తను ప్రయత్నించడం వృధా. ఆ ప్రయత్నాలు ఫలించవని తనకు తెలుసు. అయినా, ప్రయత్నించడం మానలేకపోతున్నాడు. ఒకపని, ఎంతమాత్రం కాదని తెలిసిగూడా, అందుకోసం తనెందుకు శ్రమ పడుతున్నాడు?

కొన్నిటికి కారణాలు చప్పున దొరుకుతాయి. మరికొన్నిటికి, ఏనాటికీ దొరకవు. దాదాపు - పద్దెనిమిది సంవత్సరాల పాటు, ప్రశాంతంగా సాగిన తన జీవిత వాహినిలో, ఈ రోజునే తిరిగి కల్లోలం పొటమరించింది.

ఇది సుదినమో, దుర్దినమో, తనిప్పుడేమీ చెప్పలేడు. కానీ, ఈ రోజుకు మాత్రం తన జీవితంలో చాలా ప్రాముఖ్యత ఉంటుంది. తను, కావాలని, దూరంగా విసిరేసిన ఓ వస్తువు, తిరిగి తన దగ్గరకే వచ్చింది. ఈ పునరాగమనంలో, ఆ వస్తువు రూపురేఖలు చాలా మారాయి. చాలా పరిణామాలకు ఆ వస్తువు గురికాబడింది. లోపలా, బైటా, తను ఊహించని మార్పులు ఎన్నో జరిగాయి. జీవితం-

అనుకొన్నంత హాయిగా ఉండదని తను అనుభవంమీద తెలుసు కొన్నాడు. అయితే, ఈ నిర్ణయం తనవరకే పరిమితమేమో నను కొన్నాడు. కొందరి జీవితాలయినా మహోజ్వలంగా, మహో దాత్తంగా ఉంటాయనుకొన్నాడు. నిజంగా ఉంటాయేమో, ఇప్పటికీ తను నిర్ధారణగా చెప్పలేడు. కానీ, అలానే ఉండాలని తను తపస్సు చేసిన సుందరి జీవితం మాత్రం, అందుకు భిన్నంగా ఉంది. విధి కొందరి జీవితాల్లో దుమ్మూ, ధూగరా, ఎందుకు విరజిమ్ము తాడో, మరికొందరి బ్రతుకుల్లో పూల జల్లులు ఎందుకు కురిపిస్తాడో తనకి నాటికీ తెలియకుండా ఉంది.

సరదాగా సెలవులు గడిపేద్దామని, తను మోగులూరు వెళ్ళాడు. కావాలనే తనాపల్లెటూరును కాలక్షేపంకోసం ఎన్ను కొన్నాడు. బస్తీ నాగరికతకు, నటనకు, దొంగ మర్యాదలకు, యాంత్రికబద్ధమైన జీవితాలకు దూరంగా, రవంత ప్రశాంతిగా, నిర్మ లంగా, ఇంకా మురికిగాని ఆ పల్లె ప్రజలమధ్య, నిజమైన-స్వచ్ఛమైన బ్రతుకు బ్రతకాలని, తను వెళ్ళాడు.

అక్కడే తనకు సుందరి కనిపించింది.

ఓ రోజు సాయంత్రం 'వసు చరిత్ర' చేతిలో పుచ్చుకుని, తను డాబామీద కూర్చున్నాడు. భట్టుమూర్తి ప్రతిభకు తను ఆశ్చర్య పోయాడు. గిరిక వర్ణనలో లీనమైపోయాడు. చదివినదాన్నే మళ్ళా-మళ్ళా చదువుతూ, ఆ పదాల సాయంతో, భట్టుమూర్తి చిత్రించిన 'గిరిక' వర్ణచిత్రాన్ని మనసులో ప్రోదిచేసుకుంటూ వున్నాడు. గిరిక కళ్ళముందు నిలిచింది. చిన్నగా నవ్వుతో లోకాన్ని వెలిగిస్తో, అలవోకగా తనముందు అటూ ఇటూ తిరిగింది తను అలానే 'గిరిక' వేపు చూస్తూ ఉండిపోయాడు. అలా ఎంతసేపు జరిగిందో తనకు తెలీదు. శేషగిరి బావొచ్చి గట్టిగా కుదిపాక, ఆ బొమ్మ చెదిరిపోయింది.

"ఏమిటోయ్ అలా ఆలోచిస్తున్నావ్?" అన్నాడు బావ.

"ఏమీ లేదు" అన్నాడు తను. బావతో కక్తీలేని అబద్ధ మాడాడు. నిజంగా తను ఆలోచిస్తున్నదేమిటో చెబితే బావకు అర్థంకాదు. కానప్పుడు, మరెందుకు అతనితో నిజం చెప్పటం!

"అన్నం తిని కూచోరాదుటోయ్! ఆవిడ నీ కోసం ఎదురు చూస్తూ ఉంది."

ఇద్దరూ పాత మెట్లమీదుగా కిందకొచ్చారు.

అన్నం తింటున్నప్పుడు బావడిగాడు.

"మా వూరెలా ఉందోయ్ ఆనందం? అయినా మీ బస్తీ వాళ్ళకు మా పల్లెటూళ్ళు నచ్చుతాయన్లే!- అబ్బాయ్! ఇంటికి చుట్టాలు రావడం అందులోనూ, అత్తారితరపు బంధువులు రావడ మంటే, నా ప్రాణం లేచొస్తుందనుకో! ఎందుకంటే, మామూలప్పుడు 'కొరివి కారం' 'ఉప్పు గోంగూర' విస్తట్లో పడితే, చుట్టాలొచ్చినప్పుడు నాలుగు కూరలు దొరుకుతాయి... ఒసేవ్! కాస్త చుక్కకూర పప్పిలా వడ్డించు... ఓరి నీ ఆలోచన అధ్వాన్నంగానూ- ముందు అన్నం తినవయ్యా! తరువాత ఆలోచిద్దువుగాని- అరెరె! అప్పుడే మజ్జిగలో కొచ్చావేమిటోయ్ ఆనందం!"

"నేనాటే భోజన ప్రియుణ్ని కాదు" అన్నాడు తను, ఏమీ అనకపోతే బాగుండదని.

అక్క పెరుగు వడ్డించింది.

"ఎక్కడిదే?" అన్నాడు బావ.

"సుంద రిచ్చింది" అన్నది అక్క.

తనకు పెరుగంటే చాలా ఇష్టం! తియ్యటి పెరుగుంటే అన్న మంతా దాంతోనే తినేస్తాడు, అక్కకు తన తిండి సంగతి తెలుసు గనక, తియ్యని పెరుగు తెచ్చి ఉంచింది.

భోజనాలయ్యాయి. వసారాలో బావా తనూ కూచున్నారు. దూలానికి వేలాడుతున్న హరికేన్ లాంతరు చుట్టూ పురుగులు చేరు తున్నాయి. ఆంజనేయుల గుళ్ళోనుంచి గంటల చప్పుడు వినిపిస్తోంది.

"నువ్వు చుట్ట కాలుస్తావా, సిగరెట్టా?... అదేమిటోయ్, ఈడు కుర్రవాళ్ళంతా, పెట్టెలకు పెట్టెలు తగలేస్తారు గదా? నీ కివి అలవాటు కాకపోవడం గమ్మత్తుగా లేదూ? నా పన్నెండో ఏట నేను చంద్రుడు మార్కు బీడీలు కాల్చేవాణ్ని. కట్ట ఒక్క కానీ, పదో, పన్నెండో ఉండేవి. మాలావు ఘాటులే! ఒక్క దమ్ము కొట్టే టప్పటికి తల తిరిగిపోయేది. ఇప్పుడలాంటి బీడీలే రావడంలేదు. అందుకే చుట్ట కాలుస్తున్నాను... పోనీ ఓ చుట్ట ముట్టిస్తావేమిటి? రాఘవయ్య దగ్గర్నించి ఒక్కసారే రెండు వీసెలు పట్టుకొస్తాను. మంచి సరుకిస్తాళ్లే ముండాకొడుకు...బలే ఘాటు. చేదుండదు. చుట్ట ముట్టిస్తే అలా సవాదుగా కాలుకుంటూ పోతుంటుంది. ఒకసారేంజరి గిందంటే, ఉదయమనంగా ముట్టించి, అలా మూల పడేశాను. సాయంత్రందాకా, ఆ చుట్ట అలా కాల్తూనే ఉందోయ్ ఆనందం! అంత మంచి పొగాకు... అప్పుడే ఆవలిస్తున్నావేం, నిద్రపోతావా యేమిటోయ్!"

తనేమీ అనలేదు. అంతూ పంతూ లేని ఈ 'వాగుడు' తను కొన్ని నిముషాలపాటే భరించలేకపోతున్నాడు గదా, అక్క ఎలా భరిస్తున్నదో మరి! అలవాటయిపోయి ఉంటుంది.

"ఏరా! నీకు గాలి కావాలిగావును. వసారాలో వెయ్యనా మంచం?" అన్నది అక్క.

దీపం తగ్గించి తను మంచంమీద పడుకొన్నాడు. నిద్ర రావడంలేదు. ఏవేవో ఆలోచనలతో మనస్సంతా నిండి పోయింది. భట్టుమూర్తి, వసుచరిత్ర, గిరిక - ఆవిడ సౌందర్యం కళ్ళలో తిరిగి, మనసులో మెరిసి, తన నిండా నిండి పోయినట్లనిపించింది.

ఉదయం తను స్నానం చేశాక, తల తుడుచుకుంటూ గదిలో కొచ్చాడు. తక్తాబల్ల దగ్గర, ముక్కాలి పీట, బల్లమీద కాఫీ గ్లాసూ, కనిపించాయి.

"సుందూ! ఆనంద్ వచ్చాడేమో చూడమ్మా!" అక్క గొంతు తనకు తెలుసు.

"ఇప్పుడే వచ్చారు."

"నా తల్లివిగా, మంచిదానివి, ఈ నూనె సీసా, అద్దమూ వాడి కిచ్చిరా."

క్షణకాలం నిశ్శబ్దం!

"ఇచ్చి రామ్మా సుందూ! నీకు మంచి మొగుడొస్తాడు."

గవ్వలు కదిలినట్లు నవ్వు.

మరో పావు నిమిషానికి, నూనె సీసా, అద్దమూ తీసుకొని, ఆ సుందరి తన గదిలోకి వచ్చింది.

"వదినకు బొత్తిగా మతి పోతున్నదండీ ఆనంద రావుగారూ!

అద్దమూ, నూనె ఉంటే, తలెలా దువ్వుకోంటా రనుకోందో!'' అన్నది సుందరి నవ్వుతూ.

తనేదో అనాలనుకొన్నాడు.

వంటింటిలోంచి అక్క గొంతుక ఖంగున మోగింది.

''పెద్దదాన్నే సుందూ! బిడ్డల తల్లిని. మా మతులు మతుల్లో ఉండి చావవు. పడుచు పిల్లవుగదా, నీ మతేంజేస్తు న్నదిట?''

''వస్తున్నా వొదినా!'' అంటూ సుందరి తన గదిలోంచి వెళ్ళి పోయింది.

''కాస్తయినా మతున్నదాన్ని గనకనే, ఇప్పటికయినా జ్ఞాపకం వచ్చింది'' అన్న మాటలు ఇంట్లోంచి వినిపించాయి.

దువ్వెనతో సుందరి తిరిగొచ్చింది.

''మీరు-ఇంకోలా అనుకోకండి మాష్టారూ! సుబ్బలొదినకు ఉత్త మతిమరుపు, పరమ బద్ధకమూను. వస్తువుల్ని పొందిగ్గా ఉంచుకోవడం వొదినకు తెలీదు. నాలుగు రోజులయింది మా అన్నయ్య కొమ్ము దువ్వెన తెచ్చి. సగం వళ్ళు ఊడిపో యాయి'' అన్నది సుందరి ఫకాలున నవ్వుతో ''ఏమండీ వొదినా! బిడ్డల తల్లులకు పళ్ళూడతాయట. అలాగానీ జరిగి, దువ్వెన పళ్ళు అతికించుకోలేదు గదా?'' అన్నది బిగ్గరగా.

''ఓసి నీ ఇల్లు...'' అంటూ అక్కయ్య వచ్చిందక్కడికి. ''ఏమిటే పేలుతున్నావ్ భడవా! రేపు నీ మొగుడితో ఇవన్నీ చెప్పకపోతే నా పేరు...''

"నా కింకా మొగుడు రావలసున్నాడు. వచ్చున్నదానివి నువ్వే వదినా! నీ కన్నా ముందుగా, నేనే ఆ పని చెయ్యగలను... సరి సరి, మాటల్లో పడి, ఆ చల్లారిన కాఫీ తాగేరు - ఉండండి. వెచ్చ చేసుకొస్తాను" అంటూ సుందరి కాఫీగ్లాసు పట్టుకెళ్ళింది.

"ఎవరక్కాయ్ ఈ పిల్ల?" అన్నాడు తను.

"రామచంద్రరావుగా రమ్మాయి. మనవాళ్ళే! మనశాఖ వాళ్ళే. పాపం - ఎంత మంచిదని! ఎప్పుడూ అలా నవ్వుతూ పేలుతూనే ఉంటుంది. రెండెకరాల పొలం, రెండు లోగిళ్ళూ ఉన్నాయి. వాళ్ళ నాన్న - అందరు కరణాల్లాంటివాడు కాడు— దేవుడనుకో. మంచికయినా, చెడ్డకయినా, మనకు అండగా ఉంటుంటారు..."

సుందరొచ్చింది - కాఫీగ్లాసు కాలకుండా, పరికిణీ చెంగులతో అంచులు పట్టుకొని, అడుగులో అడుగు వేసుకొంటూ.

"ఏమిటొదినా ఊదేస్తున్నావ్?" అన్నది సుందరి, కాఫీ గ్లాసు బల్లమీద పెడుతూ.

"లోకాభిరామాయణం...అది సరేగానీ సుందూ! మావాడి కేవన్నా పుస్తకాలుంటే తెచ్చియ్యరాదుటే, చదివి మళ్ళా ఇస్తాడుగా!" అన్నది అక్కయ్య.

"అలాగా వదినమ్మా! పుస్తకం బాగున్నది కదాని, చంకనెట్టుకొని పారిపోతారేమో ననుకొంటున్నాను. నీ హామీ ఉంది గనక, నిర్భయంగా ఇస్తాలే" అన్నది సుందరి, వేళ్ళు మెటికలు విరుచుకొంటో.

"ఓసి పోవే రాలుగాయీ!" అంటూ అక్క వెళ్ళిపోయింది.

"ఒదినెకు కాఫీ పెట్టే అలవాటు తప్పిపోయింది మాస్టారూ! మా అన్నగారికి ఈ కాఫీలు - గీఫీలూ జాంతానై. పదిగంటలకల్లా అన్నం పడాల్సిందే! మా ఇంట్లోనైనా, నాకే ఈ దిక్కుమాలిన అలవాటుంది...ఇంతకూ కాఫీ ఎలా వుందో చెప్పారు గాదు" అన్నది సుందరి, తక్తాబల్లమీద కూచుంటూ.

తనేమంటాడు? బావుం దన్నాడు!

సుందరి తమాషాగా నిట్టూర్పు విడిచింది.

"ఇంతగా మాట్లాడుతున్నా నా గుండెలేమో పింజం పింజం అంటూనే ఉన్నాయి సుమాండి...పట్నం నుంచి వచ్చినవారికి, నా కాఫీ నచ్చదేమో భగవంతుడా అని హడలిపోతున్నాను."

గాసు తీసుకొని సుందరి గడపలదాకా వెళ్ళిందల్లా, ఛటుక్కున వెనక్కు తిరిగి "మీరేవో పుస్తకాలు కావాలన్నారుకదా! ఏం కావాలండీ?" అన్నది తనవేపు విశాలంగా చూస్తూ.

తనకు కావలసినవి చాలా ఉన్నాయి. అవన్నీ తనకిక్కడ దొరుకుతాయా? దొరకవు గనుకనే దొరికినవాటితో తను సంతృప్తి పడాలి.

"ఏ మే మున్నయ్?"

"చాలా—" అంది. ఆ 'చాలా' దగ్గిర నొక్కి పలికినట్లనిపించింది తనకు. 'చాలా' అంటున్నప్పుడు, ఎన్నున్నాయో సూచించేందుకు, రెండుచేతులూ బార్లగా చాపి, ఓ క్షణం అలానే నిలబడి, గ్లాసులో మిగిలిన కాస్త కాఫీ గోడమీదికి చిమ్మి వెళ్ళిపోయింది సుందరి.

రాత్రినుండీ తనను బాధిస్తున్న సందేహం తీరిపోయింది. 'గిరిక' ను చూశానన్న సంబరంతో తను మురిసి పోతున్నాడు. తను

చూసింది గిరికను కాదు; సుందరిని! 'గిరిక' నిజంగా ఉన్నదో లేదో తనకు తెలీదు. కానీ, ఈ సుందరి మాత్రం తన కళ్ళముందున్నది! తానింకా 'పూర్తి కవి' కాదు. అయితే 'సుందరి' ని గురించే ఓ కావ్యం రాసి ఉండేవాడు.

ఆ మధ్యాహ్నం సుందరి, సరాసరి తన గదిలోకే వచ్చింది. ఉదయం కట్టుకొన్న పూల పరికిణీకి బదులు తెల్లటి పరికిణీ కట్టుకొంది. నీలంరంగు జాకెట్ వేసుకొంది. లేత రోజారంగు వోణీ వేసుకొంది. చేతులకు నల్లటి గాజులు తొడుక్కొంది. కళ్ళకు కాటుక పెట్టుకొంది. నిలువుపాపిటతీసి, చిక్కగా జడ వేసుకొంది పాపిటలో పచ్చటి అక్షింతలు రెండు మిగిలాయి.

"మీ రొస్తా రనుకొన్నాను" అన్నది సుందరి.

"నిద్ర పోయాను" అన్నాడు తను.

"అవును. రెండు మూడుసార్లు వచ్చి చూశాను. ప్రయాణంలో బాగా అలిసిపోయారేమో?''

'అవు' నన్నట్లు తలూపాడు తను.

''ఈపూట మా ఇంట్లో ఫలహారం చేద్దురుగాని రండి''అన్నది సుందరి, గడపదగ్గర నిలబడి అటూ ఇటూ చూస్తూ.

''అదేమిటి?'' అన్నాడు తను.

"ఏదీ?'' అంటూ సుందరి, వెనక్కు తిరిగి ఓసారి చూసి, తరువాత తనను తను కిందినుండీ చూసుకొంది. పొట్టమీది భాగం దగ్గర చూపులు నిలిపి, వోణీ సవరించుకొని, దాని వెనక నుండీ గుంపుల కాసులదండను వేళ్ళతో కదిపింది.

"ఇది మా అమ్మదిలెండి. ప్రస్తుతం నేనే వేసుకుంటున్నాను. ఏం? ... మీకు బాగోలేదా?''

నిజంగా 'అదేమిటి?' అని తను అన్నది, ఫలహారాన్ని గురించి. సుందరి ఇంకేదో చెబుతోంది.

"అబ్బే - అదిగాదు సుందరిగారూ!" అని తనేదో చెప్ప బోతున్నాడు.

"నిలువునా చంపారు మాస్టారూ! 'గారు' ఏమిటండీ నా తలకాయ్! అసలు నన్ను 'సుందరి' అని పిలిస్తేనే ఏమిటో చిరాగ్గా ఉంటుంది. 'సుందరి' — ఛ ఛ. అంచాతే, మా వదినతో దెబ్బ లాడి 'సుందూ' అని పిలిపించు కొంటాను. 'సుందరి' తోనే, నేను నానా బాధా పడుతుంటే, దానికి మీరు 'గారు' గూడా తగిలించారు. అయినా, మీకన్నా చిన్నవాళ్ళను 'గారు' అనడమేమిటి మాస్టారూ?"

నిశ్శబ్దంగా సుందరి వెంట, వాళ్ళింటి కెళ్ళాడు తను. అక్క గూడా వెళ్ళమని బలవంతం చేసింది. తప్పనిసరిగా వెళ్ళాడు తను.

"మాస్టారు ఉత్త మొఖమోటస్తులమ్మా! నీ కేమన్నా పనులుంటే చూసుకో, వారికి నే నొడ్డిస్తాను" అన్నది సుందరి లోపలికి తిరిగి.

అంతక్రితమే సిద్ధంచేసిన డ్రాయరుదగ్గర తనను కూచో బెట్టింది. పెద్ద వెండిపళ్ళెం నిండా ఇంతెత్తున పకోడీలు, వెండి మర చెంబుతో నీళ్ళు తీసుగొచ్చింది.

"మీకు ఉల్లిపాయ పకోడీలంటే ఇష్టమని సుబ్బులొదిన చెప్పింది - నేనే చేశాను. మా ఇంట్లో పెద్దుల్లి వాడం. అంటే - నేను వాడతా ననుకోండి. దిక్కుమాలిన చాదస్తాలన్నీ పెట్టుకొని మావాళ్లు - తిండిసుఖమే మరచిపోతున్నారు మాస్టారూ! దోస కాయ పప్పులో, పెద్దుల్లి వేసుకుంటే ఎంత రుచో వాళ్ల కీజన్మలో

తెలీదుగదా! ఉల్లిపాయలు ఎత్తుకెత్తు వేసిన పకోడీలు ఎలా ఉంటాయో వారికి తెలీదుగదా! — మీ రేమన్నా అనుకోండి మాస్టారూ! సుఖంకోసం చాదస్తాలను పట్టుకు వెళ్ళాడ్డం నే నసలే సహించను.''

తను, సుందరి కబుర్లు వింటూ - పకోడీలు తినడం మానే శాడు గావును, సుందరి హెచ్చరించింది.

"నే నాల్టే ఏదీ తినలేను,'' అన్నాడు తను.

''ఇష్టమైనవి తినడానికేం మాస్టారూ?''

"అయినా సరే! చాలా మితంగా తింటాను. ఇష్టంగదాని అతిగా వాడి, దానిమీది ఇష్టాన్ని చంపుకోవడం నాకు సరిపడదు.'

సుందరి నిట్టూర్చిందని తను అనుకొన్నాడు.

''టీ తీసుకొస్తాను.''

అని తెచ్చాక, సుందరీ - తనూ కలిసే టీ తాగారు. తాగు తున్నప్పుడుగూడా సుందరి ఏదో మాట్లాడుతూనే ఉంది. అప్పు డప్పుడు తనవేపు చూస్తూనే ఉంది. అలా చూసినప్పుడల్లా, సుందరి కళ్ళల్లోని మెరుపును తను గమనించాడు. కావాలని సుందరి తనకు మరీ దగ్గరగా జరగడంగూడా అతను గమనించాడు.

''వెళ్ళొస్తాను,'' అంటూ తను లేచినప్పుడు -

"అప్పుడేనా?'' అన్నది సుందరి, టీ గ్లాసులు కింద పెడుతూ. ''మా ఇల్లు చూశారు గాదు,'' అన్నది మళ్ళీ ఆమె

''మరోసారి.'

"అప్పుడు మా అమ్మ ఉండొచ్చు. మీరు స్వేచ్ఛగా చూడ టానికి అవకాశం దొరక్క పోనూవచ్చు. వాళ్లుత్త చాదస్తం మనుషులు మాస్టారూ!"

సుందరి ముందుగా నడిచి లోపలికి వెళ్లిపోయింది. వెళ్లడమా- మానడమా- అని తను తటపటాయించాడు.

"ఈ చేకర్ర, మా తాతగారు జావా నించి తెప్పించారు. ఆయన బ్రతికున్నంత కాలమూ ......... వస్తున్నారా లేదా మాస్టారూ?" అన్నది సుందరి.

"ఇదో!"

తనూ వెళ్ళాడు లోపలికి.

ఆల్మైరాలో మూలగా భద్రంగా ఉన్న ఆ కర్రను పైకి తీసింది సుందరి.

"మా నాన్న ఇప్పటికీ చెబుతుంటాడు; ఈ కర్రను చూసి అప్పటి తెల్ల కలెక్టరు — వాడి పేరేదో ఉండాలి — మా తాతను వందరూపాయలిస్తాను ఇవ్వమన్నాట్ట. ఆఖరికి, తాసీల్దారునుగూడా చేస్తానన్నాట్ట. మా తాత చచ్చినా ఇవ్వనన్నాట్ట. ఇదంటే ఆయన కంత ఇష్టం" అన్నది సుందరి, ఆ కర్ర పైభాగాన్ని తదే కంగా చూస్తూ.

తనూ చాశాడు. నల్లగా, మెరుగులు తేలుతూ ఉన్నదాకర్ర. నెత్తిమీద ఆడ మొగ బొమ్మలు దిస మొలలతో, పెనవేసుకొని ఉన్నాయి

"ఎలా ఉందంటారు?" ఆమాట అంటున్నప్పుడు సుందరికళ్లు, మరింత కాంతితో నిండి పోయాయి.

తనకో అనుమానం కలిగింది, 'ఎలాఉన్న' దని సుందరి అడుగుతున్న ప్రశ్న - కర్రను గురించా, బొమ్మను గురించా?

"మా అమ్మకీ కర్రంటే మహామంట. విరిచి పొయ్యిలో వేస్తానంటుంది. మా నాన్నకు జడిసి ఊరుకొందిగానీ, లేకపోతే"

"వస్తాను."

సుందరిముఖం ఎందుకో ముడుచుకు పోవడం తను గమనించాడు. అయినా వచ్చేశాడు తను.

ఆ తరువాత మూడురోజులపాటు సుందరి తనకు కనిపించ లేదు. తళుక్కున మెరుపులా కనిపించినా, మరు క్షణంలోనే మాయమయ్యేది. సుందరి ఎందుకిలా చేస్తున్నదో తనకు తెలీదు. అక్కగూడా తనను అమాటే అడిగింది.

"నేనేమీ అనలేదే! అయినా ఎందుకంటాను? ఏమన్నా అన్నానని చెప్పిందా?"

"లేదు. నేనే అడుగుతున్నాను" అన్నది అక్క తనవేపు అదోలాగా చూస్తూ.

"తీరిక లేదేమో?"

"దానికా?" అన్నది అక్కయ్య నవ్వుతూ.

"మరెందుకు రాదు?" అన్నాడు తను.

అక్కయ్య తనను ఎగాదిగా చూసింది.

సాయంత్రం, అక్కయ్య మంచినీళ్ళ కెళ్లినప్పుడు, సుందరి వచ్చింది - 'వదినా!'అంటూ.

ఈ మూడురోజులూ, సుందరి ఎందుకు రావడంలేదో కను క్కోవడానికి ఇదే మంచి సమయమనిపించింది తనకు. తనూ లోపలి కొచ్చాడు.

సుందరి వంటిల్లు, దొడ్డి చూసి వెళ్లబోతున్నప్పుడు, తను దోవ కడ్డంగా నిలబడ్డాడు.

"అక్క నీళ్ళ కెళ్ళింది!" అన్నాడు తను, అసలు విషయం ఎలా ప్రారంభించడమో తెలీక.

సుందరి మాట్లాడ లేదు.

"ఇప్పుడే వెళ్ళింది. పావుగంటగ్గానీ రాదు. ఏమన్నా కావాలా సుందరీ?" అన్నాడు తను.

ఈ సారీ సుందరి పలక లేదు.

"చెప్పవేం?"

సుందరి ఓసారి, వంచిన తలెత్తి, తన ముఖంలోకి చూసింది. ఎక్కడో, ఎందుకో ఎవరిమీదనో కోపం - ఆ కళ్ళల్లో, ఎర్రగా చోటుచేసుకొంటోంది మెల్లగా.

''అక్కే కావాలా?'' అన్నాడు తను అసలు విషయాన్ని చెప్పలేక ఉక్కిరి బిక్కిరవుతో, ఏదోవిధంగా సుందరినించి ఆ రహ స్యాన్ని తెలుసుకొందామని.

''మరి - మీరు కావాలనుకొన్నారా?'' అన్నది సుందరి, తనను ఎగాదిగా చూస్తూ.

తన కా సమాధానం నచ్చలేదు. నచ్చిన సమాధానాన్ని సుందరినించి రాబట్టాలన్న పట్టుదలమాత్రం తనలో వేళ్లూనుతోంది.

"ఏమన్నా కావాలా సుందరీ?' అన్నాడు తను, లోపలి విసుగును తొక్కి పెడుతో.

"కావాలి."

సుందరి పెదవులు నవ్వును మెత్తగా నొక్కుతున్నాయి. ఒక్కసారి లంగాను, పొట్టదగ్గర అటూ ఇటూ సర్దుకొని, పమిటను సరి చేసుకొంది.

"ఏం కావాలి?"

సుందరి ఫక్కున నవ్వింది.

"జడవెయ్యాలి. వేస్తారా మాష్టారూ?"

"అందుకుతప్ప నే నెందుకూ పనికిరాననా నీ ఉద్దేశం?" అన్నాడు తనుగూడా నవ్వుతూ.

"అందుకు 'తప్ప' కాదు మాష్టారూ! అందుకు 'కూడా'' అనాలనుకొంటాను."

అక్కయ్య నీళ్ళ బిందెతో వచ్చింది.

"ఏమేవ్ సుందూ ఈ! రెండ్రోజులూ నల్లపూసవయ్యావేం!' అన్నది అక్కయ్య, భుజంమీదినుంచి బిందెను మెల్లగా దించుకోబోతూ.

సుందరి వెళ్ళి సాయం బట్టింది.

"కావాలనే అయ్యాను వదినా! ఈ నల్లపూసతో నిజంగా ఎవరికన్నా అవసరముందో లేదో పరీక్షిద్దామకొన్నాను" అన్నది సుందరి.

"ఏం తేల్చుకొన్నావ్?" అన్నది అక్కయ్య, పమిటతో ముఖం తుడుచుకొంటూ.

"ఇంకా ఖచ్చితంగా తేల్చుకోలేదు. ఇప్పటిదాకా, అవసరం లే దనుకొన్నాను. ఇప్పుడేమో, 'ఉన్నదేమో, సుమా' అనిపించింది... సరేగానీ వదినా, తీరిగ్గా ఉన్నావా?"

"ఏం కావాలే?" అంటూ అక్కయ్య, సుందరి దగ్గరకొచ్చి- "తలంతా ఇలా రేగిపోయిందేమిటే!" అన్నది.

"శ్రద్ధ తగ్గిపోయింది. ఈ పూట అందుకనే వచ్చానమీ తుమీ తేల్చుకొందామని" అన్నది సుందరి.

"దేన్నిగురించి?" అన్నాడు తను, సుందరి 'అమీ తుమీ' అన్న మాటలను తనకేసి చూస్తూ అనడంతో.

"జడనుగురించి మాష్టారూ!" అన్నది సుందరి, కళ్లు చికిలించి - వెక్కిరిస్తున్నట్టు తనను చూస్తూ.

"ఇంట్లో ఉద్ధరిణెడు నీళ్లు లేవు. రెండుబిందెలు దించి; చిటికలో వస్తాను. ఈలోగా నువ్వు తలకు నూనె పట్టించి ఉంచు" అన్నది. అక్కయ్య, బిందె చంకనెత్తుకొని పోతూ. వీధి మెట్లు దిగుతూ "ఆనందం, కాస్త జాగర్తగా ఉండు నాయనా - కుక్కా, గిక్కా రాకుండా" అని మరీ వెళ్ళిందామె.

అక్కయ్య 'జాగర్త' అని ఎందుకు అన్నదో తను అర్థం చేసుకొన్నాడు. అయినా తను అజాగర్తగా ఎప్పుడున్నాడు? అసలెందుకుంటాడు? తను చిన్నవాడు కాదే!

"మీరు చిన్న పిల్లలా మాష్టారూ?" అన్నది సుందరి.

"ఏం?" అన్నాడు తను ఉలిక్కిపడి.

"ఎందుకలా హెచ్చరిక లిస్తుంది వదిన! కుక్కలో స్తే మీరు చూడరా? చూడాలని మీకు తెలీదా?"

సుందరి, వంకెనున్న నూనె సీసా తీసుకొచ్చి, గదిలో తన కెదురుగా కూచుంది. కాళ్ళు రెండూ బారచాపింది. మధ్యగా అద్దం నిలబెట్టింది. కుడిచేతిలోకి నూనె వొంపుకుని, ఎడంచేతి వేళ్ళతో పాపిటలో రాసుకుంటూ- వొంగి, నూనె అంటిందో లేదో, అద్దంలో చూసుకుంటోంది.

"రెండురోజులు నూనె లేకపోయేసరికి, జుట్టంతా దాహంతో ఆవురావురు మంటున్నట్టుగా ఉందిగదండీ! దేనికి కావలసింది దానికి ఇవ్వాలి మాస్టారూ! కానీ, కొందరి కా చిన్న సంగతిగూడా తెలీదు. మాటవరసకు——"

సుందరి ఆగిపోయింది. మరి కొంచెం నూనె వొంపుగుని, జుట్టు చివర్లకు పామి, రెండుచేతులతోనూ మెలిబెడుతోంది.

ఈ "రెండు రోజులూ రాలేదేం సుందరీ?" అన్నాడుతను ఏం చెబుతుందో తెలుసుకొందామని.

"ఎందుకూ?"

రిబ్బన్ను పళ్ళమధ్య బిగించి, సుందరి లేచి నిలుచుంది. జుట్టును గోళ్ళతో వెనక్కు దువ్వి, ఒక్కసారి తల విదిలించి, వేలు ముడి వేసుకొంది. పమిటను సీదాగా కిందికి జార్చి, రొమ్ములదగ్గర గుత్తిగా వోణీని పట్టుకొని, చెంగును విదిలించింది. వేళ్ళతో సుతారంగా పరికిణీ అంచులు పట్టుకొని, ఎత్తి దులిపింది. అద్దం నూనెసీసా,

తక్తాబల్లమీద పెట్టి, అంచుమీద కూచుని, చేతులు రెండూ వెనక్కు ఆనించి, జవాబుకోసం తనకేసి చూసింది.

"ఊరికే డుగుతున్నాను."

"ఊరికే అయితే, రాకపోతేనేం?"

ఆక్కయ్య, బిందె తీసుకొని వస్తూ వస్తూ, గదిలోకి తొంగి చూసింది.

"సుందూ! దొడ్లో మల్లెపూలున్నాయి. కోసి 'హరివేణ్ణం'లో ఉంచు. ఈ ఒక్క బిందే దించేస్తే-" అని వెళ్ళిపోయింది.

"మా దొడ్లో లేవు" అన్నది సుందరి, తనలో తను అనుకొంటున్నట్టుగా.

"ఇక్క డున్నాయిగా!"

సుందరి వెళ్ళిపోయింది.

అరగంట తరువాత, మల్లెపూల వొంకుల జడతో సుందరి వచ్చింది. పరికిణీ బదులు తెల్లటిచీర కట్టుకొంది. నల్లటి ముఖమల్ జాకెట్టు వేసుకొంది. ముఖాన - ఓ పక్కకు జారిన కుంకం బొట్టు, మెడకింద గంధం, చేతిలో జేబుగుడ్డ, చేతులకు నీలంరంగు గాజులు, చిన్న ఆకుపచ్చరాయి ఉంగరం, కాళ్ళకు జిలేబు పాంజేబు పట్టీలు....

"వదిన పేరంటానికెళ్ళింది గదూ?"

"వెళ్ళింది."

"నన్నూ పిలిచారు'' అన్నది సుందరి.

తనేమీ మాట్లాడ లేదు.

"అయినా వెళ్ళలేదు. మా వాళ్ళంతా వెళ్ళారు. ఒక్క దానికీ తోచక - ఇలా వచ్చాను. మీరూ ఒంటరిగానే ఉన్నారను కుంటూనే! ఏమన్నా కబుర్లు చెప్పండి మాష్టారూ!'' అన్నది సుందరి.

"ఏం చెప్పను?''

"చెప్పదలిచినవారు నన్నడిగా చెబుతారు!'' అని సుందరి, నేల చూపులు చూస్తూ - కింది పెదవి కొరుకుతూ; "ఏదో చెప్పండి. మంచి కబుర్లు కమ్మగా, సుఖంగా, హాయిగా ఉండే కబుర్లు చెప్పండి" అన్నది.

ఇన్నిరుచులూ కలిగిన ఆ కబుర్లేమిటో, అవెలా ఉంటాయో తనకు తెలీదు. అయితే తనకిలా తెలియదన్న సంగతి సుందరి గమ నించినట్టు లేదు. గమనించినట్లయితే తననే అలాంటి 'కబుర్లు' చెప్ప మని అడిగి ఉండదు గదా!

తనకు తెలియని విషయాన్ని, తెలిసినవారినుండి తెలుసుకోవ డంలో తప్పు లేదు. అలాంటి కబుర్లేవో సుందరికి తెలిసే ఉండాలి. కాబట్టే, సుందరి తనకు అంత మంచి కబుర్లు కావాలంటోంది. అవెలాంటివో సుందరినుండి ముందు తెలుసుకొన్నాక, తనుగూడా వాటినే మార్చి మార్చి మళ్ళీ చెప్పవచ్చు. ఆ ఉద్దేశంతోనే తను, సుందరిని అడిగాడు.

"నేనే చెప్పాలనేదేముంది సుందరీ! నువ్వూ చెప్పొచ్చు గదా!'' అన్నాడు తను.

సుందరి బలహీనంగా నవ్వింది.

"ఓ - నిక్షేపంగా!'' అన్నది సుందరి పొడిపొడిగా నవ్వుతో. "అదే మనుషుల్తో చిక్కు మాష్టారూ! ఒకరి మాటలు మరొకరికి

అర్థంకాకుండా పోతున్నాయి. నేను చెబుతూనే ఉన్నాను గానీ—''

తను కిటికీలో గుండా బైటికి చూస్తున్నాడు. చుక్కలు మాయ మవుతున్నాయి. దయ్యాల్లాంటి మబ్బులు గాలిదెబ్బకు పింజలు పింజలై ఆకాశంనిండా చెదిరి చెదిరి పడుతున్నాయి. చల్లటి గాలి రుయ్‌న వీస్తోంది.

''చాలా చలిగా ఉంది. కిటికీ తలుపులు వెయ్యండి మాష్టారూ!''

తనింకా కదల్లేదు. సుందరి తన వెనగ్గా వొచ్చి, ఆనుకొని నిలుచుంది. ఓ చెయ్యి తన భుజంమీద - పట్టుకోసం అన్నట్టుగా వేసి, మరో చేత్తో తలుపులుమూసి, గడియ బెట్టింది భుజంమీది సుందరి చేతిలో చిన్న వొణుకు, వేళ్ళలో కంపనం, కళ్ళల్లో పొగు పడుతున్న ఎర్రదనపు కాంతి నిగ్గు, కణతలమీద చిరుచెమట, పెదిమల చలనం, రొమ్ముల కదలిక, కాళ్ళ తడబాటు, వెచ్చని ఊర్పుగాలి, చెక్కిళ్ళమీది కొత్త కాంతులతో కూడిన నిగారింపు...

''వాన వచ్చేలా ఉంది'' అన్నాడు తను, వెళ్ళి మంచంమీద కూచుంటూ.

సుందరి పెదిమలలోని నవ్వు బైటకురికింది. వంకుల జడను, కుడిభుజం మీదుగా ముందుకు వేసుకొంది.

''అంటే, సుబ్బులొచ్చిన రావడానికి ఇంకా ఆలస్యమన్న మాట. ఇంకా ఏమిటి — చాలాసేపు పడుతుంది. ఇవ్వాళ వాళ్ళ సరోజినికి కార్యం. ఎంత లేదన్నా పది గంటలవుతుంది. సగం అందుకే నేను—''

గాలి ఒక్కసారి హోరు పెట్టింది. సుందరి, మాటలు ఆ హోరుగాలిలో కలిసి వినిపించ లేదు. బాగా చీకట్లు కమ్మాయి. తక్తాబల్లమీద కూచున్న సుందరి ముఖం, తనకు మసక మసగ్గా కని పిస్తోంది. కళ్లుమాత్రం లీలగా మెరుస్తున్నాయి. బైట చినుకులు ఎక్కువయ్యాయి. ఉండి ఉండి మెరుపులు, అప్పుడప్పుడు ఉరుములు... పాకలో గొడ్లు, 'అంబా' అని అరుస్తున్నాయి.

"సుందరీ!" అన్నాడు తను, చీకట్లో సుందరి ఏం చేస్తోందో తెలీక.

"ఊఁ-"

"భయంగా ఉందా?" అన్నాడు తను, సుందరి చీకటికి భయ పడుతున్నదేమోనని.

"లేదు" అన్నది సుందరి. కాస్సేపాగి "మీకో మాష్టారూ?" అన్నది.

"దీపం వెలిగిద్దామా సుందరీ?" అన్నాడు తను. ఎందుకో భయం లోలోపల ఉరకలు పెట్టింది తనకు.

"వెలిగిద్దా మంటారా?"

"ఊఁ-."

"అలాగే మాష్టారూ! చీకట్లో ముఖాలుకూడా కనిపించటం లేదు. దీపం వెలుతుర్లో అన్నీ స్పష్టంగా ఉంటాయి."

సుందరి కదిలినట్లు అలికిడయింది. నేలమీద మెల్లగా బరువుగా కాళ్ళీడ్చుకుంటూ సుందరి తన మంచం దగ్గరికి వచ్చింది. చేతులతో ఏదో వెతుకుతున్నదానిలాగా, తన తలను తాకింది. జుట్టులోకి వేళ్లు పోనిచ్చి, నిమురుతోంది. మెల్లిగా భుజాలమీదికి జార్చి, గట్టిగా

నొక్కిలాగుతోంది. వంకుల జడలోని మల్లె పూలు, తనముఖానికి తగులుతున్నాయి. సుందరి పాదాలు తన పాదాలను మెత్తగా తాకి, సున్నితంగా నొక్కాయి.

"సుందరీ!"

"ఊఁ."

"అగ్గిపెట్టి నే నిస్తానుండు."

సుందరి గట్టిగా నిట్టూర్చింది. ఆమె చేతులు తననించి దూరంగా జరిగాయి, తను కిటికీలో ఇందాక అగ్గిపెట్టి చూశాడు. లాంతరు, వరండాలో మేజామీద ఉన్నది. మెల్లగా లేచాడు. మంచం కిర్రు మన్నది. నెమ్మదిగా జరుగుతూ, కిటికీలోని అగ్గిపెట్టెను పట్టుకొన్నాడు. పుల్లలు గలగలమన్నాయి. రెండడుగులు ముందుకు వేశాడు. కాళ్ళకేదో అడ్డం తగిలింది.

"సుందరీ!"

జవాబు లేదు. సుందరిచేతులు తన నడుమును చుట్టేశాయి. ఆమె కాళ్ళు, తన కాళ్ళను పెనవేశాయి. వెచ్చని గాలితో తన చెంప కాలుతోంది. తన పెదిమ, ఆమె పెదిమల మధ్య చిదుకుతోంది. గాజులు చిట్లాయి. పాంజేబు పట్టీలు, తన కాలిని గీశాయి. గుండీలు ఊడిన 'చిట్ పట్' ధ్వనులు. వెచ్చగా, ఎత్తుగా, తన గుండెల్ని అదుముతో దాహంగా, ఆకలిగా, కోపంగా, రోషంగా, గాఢంగా, తనమీద కసి తీర్చుకుంటున్నట్టు విరుచుకుపడిన సుందరి శరీరం-తను అందంగా అపురూపంగా, గొప్పవరంగా, మహత్తరంగా భావించి పూజించే సుందరి శరీరం, తనమీదనే తిరుగుబాటు చేసి, తనతో పెనుగులాడి, పోరాడి, గెలవాలన్న ప్రయత్నం...

"సుందరీ!" అన్నాడు బిగ్గరగా. ఆ కేకతో దశ దిశలూ అదరిపోవా లనుకొన్నాడు తను. కానీ సుందరి నోటితో కప్పబడిన తన నోటిలోనే ఆ శబ్దం సుడులు తిరిగి, హోరెత్తి, అక్కడే అణిగి ఇంకిపోయింది.

బలవంతాన, శక్తినంతా కూడదీసుకొని తను, సుందరిని దూరంగా నెట్టాడు. కోకముడి జారి, కాళ్ళకు అడ్డుపడి, కుప్పగా కూలింది సుందరి. తను పోబోయాడు. పాములా జరజరా తనమీదికి పాకుతోంది.

"సుందరీ!"

చప్పున చెక్కిలితో తన నోరుమూసింది. చేతులతో మెడను కావిలించుకొంది.

"సుం —"

"అరవకండి. ఒక్క —"

గట్టిగా నొక్కి దూరంగా తోశాడు తను. ఛటుక్కున వరండాలో కొచ్చి, గది తలుపులు మూశాడు. దీపం వెలిగించాడు. ఒక్కసారి గదికేసి చూసి, కాండ్రించి ఊశాడు. జుట్టు సరిచేసుకొన్నాడు. బుగ్గలు తుడుచుకొన్నాడు. చిమచిమలాడుతున్న పెదిమను, నాలుకతో సముదాయించాడు.

సుందరి నాలుగయిదుసార్లు మెల్లగా, ఆ తరువాత గట్టిగా తలుపులు తట్టింది. కొన్ని క్షణాల తర్వాత, వెక్కి వెక్కి ఏడ్పులు వినిపించాయి తనకు. సుందరి ఏడుస్తున్నందుకు, తనెందుకో సంతోషించాడు. చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్న దనడానికి, ఈ ఏడుపు గుర్తయితే, తను నిజంగా సంతోషించ వచ్చు. అంధకారంలో ఉండి

చేసిన అనేక పనులకు, వెలుతురులో మానవుడు పశ్చాత్తాప పడడం సహజమే! మానవజాతే, అజ్ఞాన దశలో తను చేసిన ఘోర తప్పిదాలకు, ఈనాడు మూల్యం చెల్లిస్తున్నది. ఇప్పటికీ పశ్చాత్తాప పడుతున్నది.

యౌవనోద్రేకంలో ఉండి, సుందరి చేయ సిద్ధపడిన ఓ ఘోర పాపకార్యాన్ని, తను వివేకంగా తప్పించాడు. ఆమె జీవిత చరిత్రలో ఒక్క తుడుపు, ఒక్క కొట్టివేతా లేకుండా చేశాడు. తన కది చాలు. తనూ సుందరిలా నే తొందర పడితే, మనిషిలోని 'మృగం' సంతృప్తి పడవచ్చు. కానీ, మనిషి మాత్రం విచారించక తప్పదు...

ఇప్పటికి సుందరిలోని 'మృగం' నిదురించి ఉంటుంది. ఆమె కూడా సత్యాన్ని తెలుసుకొని ఉంటుంది. ఈ క్షణికోద్రేకాల వల్ల ఆమె భావిజీవితం ఎంత పతనమవుతుందో విప్పిచెప్పి, ఆమెకు జ్ఞాన బోధ చేయవలసిన బాధ్యత తనకున్నది. తను వివేకి గనుక, నిగ్రహపరుడు గనుక సరిపోయింది. ఇదే మరొకడయితే ఏమయ్యేది?

మెల్లగా తను తలుపులు తెరిచాడు. లాంతరు చేతబట్టుకొని గదిలోకి అడుగుపెట్టాడు. గది నాలుగుమూలలూ వెదికాడు. సుందరి లేదు! దొడ్డితలుపు గాలికి అటూ ఇటూ ఊగుతోంది.

ఓ క్షణం తను దిమ్మరపొయ్యాడు. లాంతరు తక్తా బల్లమీద పెట్టాడు. గదినిండా రాలిన మల్లె రేకులు, మెల్లగా నవ్వుతున్నాయి. చిందరవందరైన పక్క దిగులుగా చూస్తోంది.

సుందరి ఏదో విధంగా ఈ గదిలోంచి వెళ్ళిపోయింది. ఆమె తాలూకు ఈ చిహ్నాలుగూడా తీసేస్తే, ఆమె జీవితానికి 'కళంకం' ఉండదు. నేలమీద కూచుని, ఆ భయంకర కార్యానికి చిహ్నాలుగా

ఉన్న మల్లెపూల రేకుల్ని, చిట్లిన గాజు పెంకుల్ని ఏరుతున్నాడు తను.

"ఎంత పని చేశావురా ఆనందం!"

చటుక్కున తను తలెత్తి చూశాడు. ఎదురుగా అక్కయ్య!

"నే ననుకొంటూనే ఉన్నా. అలాగే కొంప ముంచావు! ఆ కరణంగారికి తెలిస్తే ఇంకేమన్నా ఉందిట్రా! దానికి మూడు ముళ్ళు పడతాయిట్రా! నీ కిదేం పొయ్యేకాలంరా ఆనందం!"

అక్కయ్య నెత్తీ నెత్తీ కొట్టుకొంటో ఏడుస్తోంది. తనిప్పుడు ఆమెను నమ్మించ లేడు. నిజం చెప్పినా ఆమె నమ్మదు. తను సుందరిని బలవంతం చేశాడనే అనుకొంటున్నది.

"ఇన్నేళ్ళనించి ఉంటున్నా, ఒక్క మాటనుకో లేదు. నీ మూలకంగా తలకాయ పగలగొట్టుకు చచ్చే రోజొచ్చింది. ఎంత-పని చేశావురా ఆనందం !"

తనకు పిచ్చెత్తినట్లయింది. చేతిలో మల్లెరేకులు గాజుపెంకులు అలానే వున్నాయి. వాన వెలిసింది. ఈదరగాలి అప్పుడప్పుడు కదులుతోంది. బెడ్డింగ్ చేతబట్టుకొని వచ్చేశాడు. వస్తూ వస్తూ కరణంగా రింట్లోకి తొంగి చూశాడు. లాంతరు గడపమీద వెలుగుతోంది. పశువులు చలికి అరుస్తున్నాయి. ఒక్క ఊపుతో బెడ్డింగ్ భుజానికెత్తుకొని, స్టేషన్‌కేసి నడిచాడు...

మొగులూరు వెళ్లడానికి అదే ఆఖరు; సుందరిని చూడటానికి గూడ అదే ఆఖరు. ఈ లోగా తన బ్రతుకులోనూ అనేక మార్పులు వచ్చాయి. మనుషులమీద అసహ్యం వేసింది. తనకు

తనవారి సంగతీ, సుందరి సంగతీ గూడా తెలీదు, తెలుసుకోవాలన్న ఇచ్ఛగూడా తనకు లేదు. అన్నింటినీ సన్యసించి ఈ ఆశ్రమంలో ఉంటున్నాడు. ఏకాంతంగా ఉండాలని తన అభిలాష. ఈ రోజున సుందరి దానికి విఘాతం కలిగించింది. తిరిగి సుందరిని తను చూడ గలననీ, ఆమెలో ఇన్ని మార్పులొస్తాయనీ, తను అనుకో లేదు.

అయితే ఈ లోకంలో, తను అనుకొన్న వాటికంటే, అను కోనివే ఎక్కువ జరిగాయి. ఇదీ అటువంటిదే!

ఇన్ని సంవత్సరాల తరువాత ఆలోచిస్తుంటే, ఆనాడు తను చేసిన పనీ, తను ప్రవర్తించిన విధానమూ, సరికాదేమోనన్న అను మానం కలుగుతోంది. ఆ సంఘటన తరువాత సుందరి వ్రాసిన జాబు, ఇంకా తన దగ్గర ఉంది. అప్పటి మల్లె రేకులూ, గాజు ముక్కలు గూడా తన దగ్గర ఉన్నాయి...

ఆనందస్వామి, దుప్పటిని లాగితన్ని లేచి కూర్చున్నాడు. దీపాన్ని పెద్దదిచేసి, మూలనున్న చిన్న మూటను విప్పాడు. అందులో పొడి పొడిగా అయిపోయిన మల్లెరేకులు, గాజు పెంకులు, ఓ కాయితం మడతలో ఉన్నాయి.

ఆ కాగితం — అదే సుందరి రాసిన జాబు!

ముందు 'మాస్టారూ!' అని రాసి, తరవాత ఆ మాట కొట్టి వేసి వుంది. దాని పక్కనే 'చవటా!' అని రాసి, అది గూడా కొట్టి వేసి వుంది.

"మిమ్మల్నేమని పిలవడానికీ మనస్కరించక, ఇలా ఉత్తినే వదిలేస్తున్నాను. ఒక్కో మనిషిమీద అసహ్యం, ఎందుకు కలుగు

తుందో కారణం చెప్పడం కష్టం! మిమ్మల్ని చూశాక నాకు జాలి, అభిమానం గూడా కలిగాయి. కలకాలం మీ పక్కనే ఉండి, మీ జీవితంలో భాగం పంచుకోందా మనుకొన్నాను. ఎందుకో నాకు తెలీదు. మీరంటే 'పిచ్చి ప్రేమ' కలిగింది ఈ లోకంలో ఎవరైనా, తన్ను అర్పించుకోవడం కన్నా ఇవ్వగలిగిన గొప్పవరం, చెయ్యగలిగిన గొప్ప త్యాగం లేదనుకొంటాను. అదే మీకు నేను ఇవ్వబోయాను. నా సర్వస్వం మీ పాదాలముందు చెల్లించుదా మనుకొన్నాను. గుడ్డివాళ్ళయి, మూర్ఖులయి, దాన్ని తిరస్కరించారు. మనిషి కోరే గొప్ప వరాల్లో కల్లా గొప్పవరం - మీ చేతుల్లోకొస్తే, దూరంగా నెట్టేశారు. మీరు ఏదో ఒకనాటికి పశ్చాత్తాప పడతారని నాకు తెలుసు. నాకు కావలసింది గూడా అదే! —"

ఆనందస్వామి కళ్ళు నీటితో నిండిపోయాయి. ఉత్తరాన్ని చదవలేక పోయాడు. అలానే కట్టి, పెట్టెలో భద్రపరిచాడు. దీపాన్ని తగ్గించి, తిరిగి మంచంమీద పడుకొన్నాడు.

అవును. సుందరి వ్రాసింది నిజమే! తనే తెలుసుకోలేక పోయాడు. ఏవేవో సిద్ధాంతాలను నెమరు వేసుకొంటూ, సిద్ధాన్నాన్ని నేలపాలు చేశాడు. తనజీవితాన్ని బుగ్గిపాలు చేసుకొన్నాడు. తనను మనసారా ప్రేమించి, తన పాదాల దగ్గర కొచ్చిన తారుణ్యహృదయాన్ని, నిర్దయగా కాలితో, ఆవలకు నెట్టాడు.

అయినా మించిపోయిం దేమీ లేదు. ఇప్పటికయినా, తన కా అవకాశం భగవంతుడు కలిగించాడు. సుందరి జీవితం, ఈ ఏడు సంవత్సరాల్లో ఏమిటి కానివ్వు — తనకు సంబంధం లేదు. తనకు కావలసింది — అప్పటి తారుణ్య హృదయం, అప్పటి ప్రేమ స్వరూపిణి! ఒకప్పుడు తాను దూరంగా త్రోసివేసిన ఆ దేవతావర మే,

ఇప్పుడు తిరిగి తన అందుబాటులో కొచ్చింది. తనెందు కా వరాన్ని స్వీకరించ గూడదు ?

ఆనందస్వామి ఈ నిశ్చయంతో లేచాడు. తన గదినుండి వెలుపలకు వచ్చాడు. చల్లటిగాలి క్షణకాలం వీచింది! చంద్రుడు కొండమీద వెలుగుతున్నాడు. దూరంగా కీచురాళ్లు అరుస్తున్నాయి. గట్టిగా గాలి పీల్చి, సుందరి ఉన్న పాక దగ్గర కొచ్చాడు.

లోపల సన్నగా చిన్నగా దీపం వెలుగుతోంది. తలుపు తీసుకొని లోపలి కొచ్చాడు. సుందరి చిరిచాపమీద పడుకొని వుంది. ఒక ప్రక్కగా, ఆమె మధ్యాహ్నం తెచ్చిన గుడ్డల మూట ఉంది. దీపం హెచ్చించి, తలుపు దగ్గరగా వేశాడు. సుందరికేసి కన్నార్ప కుండా చూశాడు.

అలసి పోయిందేమో, గాఢంగా నిద్రపోతోంది. పమిట తొలగి, పొట్టమీదుగా పక్కకు జారింది. రవిక ముడి ఊడిపోయి ఉన్నది. చీర ఒక్కపొరే మోకాళ్ళదాకా వుంది. చేతుల నల్లగాజులు, దీపకాంతికి గిలగిలలాడుతున్నాయి. ఆనందస్వామికి 'గిరిక' జ్ఞాపకం వచ్చింది. ఆనాడు డాబామీద కూచుని 'వసుచరిత్ర' చదువు తున్నప్పుడు, గిరిక సౌందర్యాన్ని భావించి విస్మితుడయ్యాడు. అటువంటి లోకోత్తర సౌందర్యవతి వలచిన కథానాయకుణ్ణి, అతని అదృష్టాన్ని తలుచుకుని మురిసిపోయాడు. కానీ, అటువంటి వ్యక్తే తనకు జీవితంలో తటస్థ పడినప్పుడు కళ్లు మూసుకొన్నాడు. ఎంత అవివేకం!

"సుందరీ!" అన్నాడు ఆనందస్వామి మెల్లగా.

సుందరి పలక లేదు.

మెల్లగా వేళ్లతో బుగ్గమీద తట్టాడు.

నెమ్మదిగా పక్కకు తిరిగి, రెండు చేతులూ చాపి - దగ్గరికి తీసుకొంటూనే, ఉలిక్కిపడి కళ్లు తెరచిచూసింది. తన చేతుల్లో ఆనంద స్వామి ఉన్నాడు. చివాలున లేచి, అతన్ని దూరంగా నెట్టింది. కోకను పాదాలదాకా లాక్కుంది. పమిట సరిచేసుకొంది. రవిక ముడివేసుకొని, కాళ్ళచుట్టూ చేతులు చుట్టి కూచుంది.

"సుందరీ!"

ఓసారి అసహ్యంగా, భయంగా, రోతగా, అతనికేసి చూసింది సుందరి.

"నన్ను క్షమించు సుందరీ! చాలా పొరబాటు చేశాను. నా తప్పు నేను తెలుసుకొన్నాను. ఒకప్పుడు నిన్ను చేతులారా పోగొట్టుకొన్నాను. తిరిగి భగవంతుడే నిన్ను నా దగ్గరికి తీసుకొచ్చాడు. తెలిసీ తెలీని దశలో నిన్ను నేను అర్థం చేసుకోలేక పోయాను..."

"వెళ్ళి పడుకోండి. నాకూ నిద్రొస్తోంది" అన్నది సుందరి గట్టిగా ఆవలిస్తూ.

"అందుకోసం నేను రాలేదు సుందరీ!"

"ఏం కావాలి?" అన్నది సుందరి గట్టిగా.

"నా కేం కావాలో నీకు తెలియదా సుందరీ?"

"తెలుసు. విశ్రాంతి కావాలి. వెళ్ళి నిద్రపోండి. మీరు సుఖపడండి."

"ఏడు సంవత్సరాలు, నీకు దూరంగా ఉన్నాను — "

సుందరి లేచి. తన మాటను అందుకోబోయింది. ఆనంద స్వామి అడ్డుకున్నాడు. ఆమె రెండు చేతులూ పట్టుకొని, తనవేపు లాక్కున్నాడు. ఒక్కసారి తూలి, అతనిమీద పడింది. ఆమె నడుముచుట్టూ చేతులు చుట్టి, తనవేపు అదుము కొన్నాడు. పక్కకు తిరిగిన ఆమె ముఖాన్ని, తనవేపుకు తిప్పుకొనేందుకు పెనుగు లాడాడు. ఆమె అతని గుండెలమీద చెయ్యివేసి, దూరంగా నెట్టు తోంది.

"అరవకు, కదలకు. ఒకప్పుడు నా దగ్గరకొచ్చిన ఈ వరాన్ని, ఈ అందాన్ని, నిన్ను పారేసుకొన్నాను. మళ్ళా ఆ పొరపాటు చెయ్యలేను. ఈ ఒక్క — "

అతను రొప్పుతున్నాడు.

"ఛీ !"

బలంగా ఒక్క నెట్టు నెట్టింది. తూలి పడ్డాడు.

"ఫో, దూరంగా ఫో. దగ్గర కొచ్చావంటే చచ్చి పోతాను".

పదివేళ్ళతోనూ గొంతు పట్టుకొని, బిగ్గరగా అరచింది సుందరి ...

ఆనందస్వామి కంపించిపోయాడు. అతని కళ్ళల్లో నీరు ఉరలి, పొరలి చెక్కిళ్ళ మీదుగా ధారలు కడుతోంది. కణతల మీది నరాలు ఉబికాయి. గొంతు తడారి పోయింది. నిలువెల్లా చెమటలు దిగజారి పోతున్నాయి.

"సుందూ !" అన్నాడు గాద్గదికంగా ఆనందస్వామి.

"ఛో !"

ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. పళ్ళు పటపట లాడిస్తోంది.

"దురదృష్టవంతుణ్ణి సుందూ !"

తన గదికేసి వెడుతున్న ఆనందస్వామి మాటలు గాలిలో తేలుతూ, సుందరికి వినిపించాయి. ఓ క్షణం అతనికేసి చూసి, ఆమె కుప్పలా కూలి పోయింది. దిండులో తల దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది సుందరి!

## 2

ఓ చిన్న వాక్యం, మరో చిన్న సంఘటన, తలవని తలంపుగా కలిగే ఓ పరిచయం, హఠాత్తుగా ఎదురయ్యే కొత్త ముఖం, జీవితంలో బ్రహ్మాండమైన మార్పులు తీసుకొస్తాయని విన్నప్పుడు, తన కెందుకో ఆ మాటల మీద నమ్మకం కలగలేదు. అంత తేలిగ్గా మనుషులు మారరని తన విశ్వాసం. అలా మారే వారు మనుషులే కారనీ, వారికి జీవితంలో స్థిరమైన నమ్మకాలు అభిప్రాయాలూ ఉండవనీ, గాలికి కొట్టుకు పోయే వాగుడాకు లాంటివారనీ, తను అనుకొంటుండేది.

తొలిసారిగా, సుబ్బులొదిన ఇంట్లో ఆనందాన్ని చూసి నప్పుడు, తన అభిప్రాయాలు వేలి, చిట్లి పొయ్యాయి. ఎందుకో ఆ మధ్యాహ్నం సుబ్బులొదిన ఇంటి కెళ్ళింది. ఒదిన, నట్టింట కూచుని అప్పడా లొత్తుతోంది.

"రావే సుందూ! పిండి పెడతాను" అన్నది వదిన.

తనకు కాల్చిన అప్పడాల కంటే, పచ్చి పిండి అంటేనే ఎక్కువ ఇష్టం !

"అన్నగారు పొలం వెళ్ళారు గాదా యేం వొదినా ?" చూపుడు వేలు అప్పడాల పిండిలో గుచ్చి, ఇంత ముద్ద తీసుకుని చప్పరిస్తూ అడిగింది!

"వెళ్ళక పోతే ఎలా తల్లీ! మీకులా జీతగాళ్ళు, నాత గాళ్ళు మా కెలా వస్తారమ్మా !"

"అందు గ్గాదొదినా ! గదిలో ఎవరో పడుకోనుంటేనూ — అబ్బ !మరీ చప్పగా ఉందొదినా పిండి. చిటికెడు ఉప్పూ, ఒక్క రవ్వ ఇంగువ రెబ్బా కలిపితే, మజా మాడిపోతుం దనుకో !"

"ఓసి నీ యింట మానుగురవా !మాటలు నేర్చవే భడవా! సరే, ఇంకేం - వెళ్ళి, అలమార్లో ఇంగువడబ్బా, బుట్టలో ఉప్పూ ఉంటుంది. పట్టుగొచ్చి వెయ్యి మరి !"

వేశాక అనిపించింది, వచ్చిన చుట్టమెవరో చూడాలని ఏదో పనున్న దానిలా, ఆనందం పడుకొన్న గదిలోకి వచ్చింది. తను. కట్ బనీను వేసుకొని, గ్లాస్కోపంచె లుంగీగా కట్టుకొని. వెల్లకితలా పడుకొన్నాడు ఆనందం. ఉంగరాలు తిరిగిన పొట్టి జుట్టు, పెదిమల చివరిదాకా పెంచిన వత్తు మీసం, మెడకింద ఎత్తుగా ఎదిగిన వెంట్రుకలు, ఊపిరి పీల్చేప్పుడు, పైకి లేచి. కిందకి వొంగే ఎదుర్రొమ్ము, పచ్చగా, బలంగా, నిగనిగలాడే శరీరం ... తన కెందుకో ఆనందం కేసి చాలా సేపు చూడా లనిపించింది.

తక్తా బల్లమీద పెద్ద బైండు, గుర్తుపెట్టి ఉంది. తను తీసి చూసింది. 'వసుచరిత్ర'. 'గిరిక'ను భట్టుమూర్తి వర్ణించిన పద్యా లన్నీ పెన్సిల్‌తో గుర్తుపెట్టి ఉన్నాయి. వాటి ప్రక్కనే 'గొప్ప అందం' 'మహా సౌందర్యం',' అద్భుతమైన వర్ణన' 'లోకోత్తర మైన చిత్రణ' లాంటి వాక్యాలున్నాయి. అవన్నీ గిరికకు సంబం ధించినవే! కావ్య నాయికల అందమన్నా, అలాంటి అలంకరణ మన్నా ఆనందాని కిష్టమని తనుఅనుకొంది.

సాయంత్రం, ఆనందాన్ని 'గమ్మత్తు' చెయ్యాలనుకొంది తను. అచ్చంగా గిరికలా తనూ అలంకరించుకొంది. సుబ్బలోదిన్ని వేధించి, అజంతా ఫక్కీలో జుట్టు ముడి వేయించుకొంది. తనకున్న సొమ్ములన్నీ పెట్టుకొంది. మంచి గుడ్డలు కట్టుకొంది. ఆనందం డాబా మీద కొచ్చాడని చూసి, తనూ తమ డాబా మీది కొచ్చింది.

తనను చూడాలని, చూసి ఆనందం ఆశ్చర్యపోవాలనీ తన ఉద్దేశం. కానీ, ఆనందానికి ఈ లోకంతో ఉన్న సంబంధం చాలా తక్కువనిపించింది, పుస్తకంలో మునిగిపోయి లొట్టలు వేయడం మినహా, తన చుట్టూ ఏం జరుగుతోందో చూడలేనంత అమాయకుడు ఆనందం. ఉండబట్టలేకనేమో తనే పక్కున నవ్వింది. అప్పుడు చూశాడు ఆనందం.

కదలడు. మెదలడు. కన్నార్పడు - ఒకటే చూపు. ఆ చూపులు బంధనాల్లాగా తనను కట్టివేశాయి. తన చుట్టూ తిరిగి బలంగా, తీవ్రంగా, చురుగ్గా, తనను ఆనందం కేసి లాగుతున్నాయి. ఏదో అతన్ని తమాషా చేదామని తనొచ్చింది. కానీ, తనే ఓడిపోతోంది. అలా ఎంతసేపు గడిచిందో తనకే తెలీదు. శేషగిరన్నయ్య తల డాబామెట్లమీద కనిపించింది. తను, డాబా దిగి కిందకొచ్చింది.

"ఎవరే సుబ్బులుగారింటి కొచ్చిన చుట్టాలు?" అన్నది అమ్మ.

"సుబ్బలోదిన తమ్ముడట."

అప్పుడు జ్ఞాపకమొచ్చింది తనకు ఆనందానికి తియ్యని పెరుగంటే ఇష్టమని, సుబ్బలోదిన అన్నమాట.

"సుబ్బులొదిన పెరుక్కావాలన్న దమ్మా! ఆనందం గారికి తియ్య పెరుగంటే చాలా ఇష్టమట."

అమ్మ సణుక్కొంది. వృథాగా గిన్నెడు పెరుగు పోతోందే- అని అమ్మ ఏడుపు. అమ్మ ప్రతిదానికీ ఏడుస్తుంది.

"కావలిస్తే ఆవి డడగ్గూడదు లే, మధ్యలో నీ రాయబార మెందుకూ - ముష్టి రాయబారం ?"

నిజంగా సుబ్బులొదిన పెరుక్కావా లన లేదు. ఆనందానికి తియ్యపెరుగంటే ఇష్టమని మాత్రమే చెప్పింది. సుబ్బులొదిన అడిగినట్టు, తనే కల్పించింది.

ఆ తెల్లవారి మాటల మధ్యలో సుబ్బులొదిన్ను తను అడి గింది, 'ఆనందానికి పెరుగు నచ్చిందా' అని.

"ఆ. అన్నమంతా దాంతోనే తిన్నాడు."

తన కెందుకో, సంతృప్తి కలిగింది.

ఓ రోజు, అమ్మ సుబ్బులొదిన ఇంటి కెళ్ళినపుడు, ఆనందాన్ని తన ఇంటికి పిలుచు కొచ్చింది. మొన్న నోసారి వొచ్చినపుడు, ఉల్లిపాయ పకోడీలూ, పాల డికాక్షన్ టీలు తనిచ్చింది; ఇల్లు చూడటానికి రమ్మంటూ ఆనందాన్ని లోపలికి తీసుకెళ్ళింది. తాతయ్య జావానించి తెచ్చిన ఆకర్ర చూపించింది. ఆనందం, ఆకర్రను — అదే — దానిమీది బొమ్మను చూసి ఏమంటాడో తెలుసుకోవా లనుకొంది. ఏమీ అనలేదు. మెచ్చుకోనూ లేదు. అట్టే అసహ్యించు కోనూ లేదు. తన కెంతో బాగా నచ్చిన ఆ బొమ్మ, ఆనందాని కెందుకు నచ్చలేదో, తను ఊహించలేక పోయింది. ఓ అందమైన

అమ్మాయీ, బలమైన అబ్బాయీ, గుడ్డలేకుండా - మిన్నాగుల్లా మెలుచుకు పోయిన ఆ బొమ్మ, ఎన్నో తియ్యటి ఆలోచనల్ని, అందమైన కలల్నీ, కమ్మని అనుభూతుల్ని, కలిగించాలి గదా! ఇవన్నీ ఆనందానికి కలగలేదా ? కలిగినా, తనంత తేలిగ్గా బైట పడటం ఇష్టంలేక, గంభీరంగా ఉండి పోయాడా ?

తన కెందుకో, ఈ విషయం గట్టిగా తేల్చుకోవా లనిపించింది. అత నేమనుకుంటే నేమన్న ప్రశ్నే లేదు. కావలసిందల్లా తన కీ విషయంలో స్పష్టత.

అందుకే అమ్మ లేనప్పుడు, పుస్తకాల కోసమని ఆనందాన్ని పిలుచు కొచ్చింది తను. ముందు 'రా' నని సణిగాడు ఆనందం. బలవంతాన తనే లాక్కొచ్చింది,

"టీ కావాలా మాస్టారూ ?"

ఆనందం, కళ్లు పెద్దవి చేసి తనకేసి చూశాడు. 'ఆ చూపులో ఆశ్చర్యానికి బదులు అనురాగం ఉండి, అలా యుగాల పర్యంతం తనకేసి చూస్తూ కూచోగూడదా' అనిపించింది తనకు.

"సుబ్బులొదిన చెప్పింది. మీరేదో స్కూల్లో టీచరుగా పని చేస్తున్నారటగా !"

'అవు' నన్నట్టు తలూపాడు ఆనందం.

"ఇంతకూ మీకు టీ కావాలో అక్కర్లేదో చెప్పారు గాదు?"

"ఒద్దు"

ఆ తరువాత ఏం మాట్లాడాలో తనకు తోచలేదు. ఎలా తనక్కావలసిన పరిధిలోకి ఆనందాన్ని లాక్కు రావాలో తెలియ

లేదు. ఆనందంగూడా ఇబ్బంది పడుతున్నట్టు మాత్రం తను గ్రహించింది.

"ఏం పుస్తకాలు కావాలి మాస్టారూ ?"

"ఏమున్నయ్ ?"

"ప్రబంధాలు, కావ్యాలూ నా దగ్గర్లేవు."

"నే చదివాను" అన్నాడు ఆనందం.

తనెప్పుడో, చిన్నతనంలో చదివిన 'మనుచరిత్ర' జ్ఞాపకం వొచ్చింది. అందులో కథానాయిక వరూధిని, ఎంతో గాఢంగా ప్రవరుణ్ణి ప్రేమించి, అతనికి తన హృదయాన్ని విప్పి చెప్పి, 'నన్ను స్వీకరించవయ్యా మహాప్రభో !' అంటూ ప్రవరుని దగ్గర కెడితే - 'ఛా ఫో తప్పుడు ముండా' అంటూ నెట్టిపారేశాడా పిచ్చి వెధవ !

ఆనందంతో కబుర్లు పెంచడానికి, ఈ జ్ఞాపకం బాగా పని కొచ్చింది తనకు. ఈ సంఘటన మీద ఆనందం అభిప్రాయ మేమిటో తెలుసుకొంటే, జావా కర్రమీది అందమైన ఆ బొమ్మను ఆనందం నిజంగా మెచ్చుకుంటున్నాడో లేదో గూడా పరోక్షంగా తేలి పోతుంది.

"చూడండి మాస్టారూ!" అంటూ, తను, వరూధిని విష యాన్ని ప్రస్తావించింది. "ఆ సందర్భంలో ప్రవరుడలా ప్రవర్తించడం అనుచితం కాదా?" అన్నది ఆనందం ముఖాన్ని పరిశీలిస్తో.

"కా దనుకొంటాను." అన్నాడు ఆనందం. క్షణమాగి "కాదు" అన్నాడు గట్టిగా, తల అడ్డంగా తిప్పుతూ.

"నేను మీకు ఫక్తు వ్యతిరేకం!"

"అలాగా!" అని చప్పున జారిపోయాడు ఆనందం. 'ఎందుకని?' అని అడిగితే, సంభాషణ పెరిగేది. కానీ, ఎక్కడి కక్కడ పట్టుబడకుండా జారి పోతున్నాడు.

"వరూధిని మంచి పరువంలో ఉంది. గొప్ప అందగత్తె. ప్రవరుణ్ని చూసింది. మనస్ఫు నిండుగా ప్రేమించింది. ఇంత కాలమూ తన శరీరం, వయస్సు, హృదయలాలిత్యం, కోమలత్వం, అనురాగం, ప్రణయం, ఎవ్వరికీ దక్కకుండా, ఎవ్వరూ తాకకుండా దాచి ఉంచి, హృదయ పూర్వకంగా ప్రవరుడికి అర్పించింది. కానీ ఆ పిచ్చి బ్రాహ్మడు వద్దనేశాడు."

"కథ నాకు తెలుసు" అన్నాడు ఆనందం, కుచ్చెళ్ళచెంగుతో చిరు చెమటను తుడుచుకొంటో.

"తెలీదని కాదు మేస్టారూ! ఆ సందర్భంలో ప్రవరుడలా చెయ్యడం ఎబ్బెట్టుగా, రోతగా, మూర్ఖంగా, బండగా లేదా అని మాత్రమే నే నడుగుతున్నా... లేదని మీరంటే కాదు; ఎలా లేదో నాకు చెప్పండి. ఇంతకాలమూ నే ననుకోవడం, ప్రవరుడుత్త చవటని. నేను పొరబాటుపడితే, దాన్ని దిద్దుకోడం అవసరం కాదూ?"

ఆనందం, ఎందుకో ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు దేనికోసమో వెదుకుతున్నట్టు తనకు కనిపించాడు.

"ఒక్క సంగతి" అన్నాడు ఆనందం గొంతు సవరించుకొని, మరోసారి చెమటలు తుడుచుకొంటో.

అమ్మయ్య! జగన్నాథ రథం కదిలింది! !

"వరూధిని, అతన్ని ప్రేమించినమాట నిజమే! కానీ, ప్రవరుడు ఆవిణ్ని ప్రేమించ లేదు."

"ద్వేషించాడా?"

"లేదు – లేదులా ఉంది."

"ద్వేషించకపోతే, వరూధినిని దూరంగా నెట్టేస్తాడా? ఆమె, తన జీవమంతా కరిగించి, పెంచి, పోషించి ఇచ్చిన ఆ కానుకను కాదంటాడా?"

"అనడులా ఉంది" అన్నాడు ఆనందం నసుగుతూ.

"కానీ - అన్నాడు. అంటే, ప్రవరుడు వరూధినిని ద్వేషించాడన్నమాటే! అవునా మాస్టారూ?"

"అవు ననుకొంటాను."

"ప్రవరుడు నిత్యాగ్నిహోత్రి. వేదవేదాంగాలు చదివాడు. సకల శాస్త్రాలూ పఠించాడు. కానీ, ఇవి చదివిన తాలూకు సంస్కారం అతనిలో లేదు. అందర్నీ సమానదృష్టితో చూడవలసిన మనిషి, శుద్ధ మానవద్వేషిగా మారిపోయాడు. ఎవర్నయినా క్షమించవొచ్చుగానీ, మనుష్యద్వేషుల్ని మాత్రం క్షమించకూడదు మాస్టారూ! కదూ?"

ఆనందం తనకేసి ఎర్రగా చూశాడు. ఆ చూపులో కోపం, రోషం, ఓడిపోతున్నానన్న బెంగా, తనకు కనిపించాయి.

"ప్రవరుడు, నీవు నిర్ణయించినట్టుగా లేడు సుందరీ! అతను నిజంగా గొప్పవాడే! వరూధినిని కాలదన్నడానికి కారణం, అతను పెళ్ళయినవాడు కావడమే ననుకొంటాను. అవివాహితు డయి

నట్లయితే, వరూథినిని తిరస్కరించి ఉండేవాడు కాదేమో!" అన్నాడు ఆనందం.

"ప్రవరుడిలో ఆ చేవా, తెగింపూ, ధైర్యమూ, తీవ్రతాలేవు. ఉన్నవాడయితే, తనను మనసారా వలచి, తనే దిక్కనుకొన్న స్త్రీని, తనకు తనుగా అర్పణం చేసుకొన్న స్త్రీని, కాదని వద్దని నెట్టి, పిలక ఝూడించుకొంటూ, కొంపకు జేరుకోడు... అదికాదు మాస్టారూ! ప్రవరుడికి పెళ్ళికావడం, కాకపోవడం ప్రశ్నకాదు. అతనిలో తెగువా, చొరవా వుండటమూ, లేకపోవడమూ అన్నదే ముఖ్యం."

ఆనందం కొన్ని క్షణాలపాటు మౌనంగా వుండిపోయాడు. తరువాత మెల్లగా తలెత్తి, చిరునవ్వు నవ్వాడు.

"వరూధనంటే నీకు చాలా ఇష్టమా?" అన్నాడు ఆనందం పూర్తిగా నవ్వుతో.

"ఇష్టంకాదు మాస్టారూ, జాలి! ప్రవరుడంటేనే అసహ్యం. బహుశా, ఆ అసహ్యమే వరూధినిపట్ల నాకు జాలిని కలిగించిందేమో మరి!"

"ప్రవరుడంటే నాకు చాలా అభిమానం. కానీ, వరూధిని మీద నాకు అసహ్యంగానీ, కోపంగానీ లేవు. నువ్వన్నట్టు, వరూధిని తన సర్వస్వాన్నీ నిండుహృదయంతో ప్రవరునికి అర్పించినా, ఆ కానుకను నిస్సంకోచంగా కాలదన్నాడంటే, అతనిలోని ఔన్నత్యం ఎంత ఉదాత్తమైనదో నువ్వెందుకు అర్థంచేసుకోవు?"

ఆనందంమీద తనకు కోపం వచ్చింది.

"మానవ ద్వేషిలో ఔన్నత్యమేమిటి మాస్టారూ, నా తలకాయ! రాయి దేనికీ చలించదుగనుక, మహర్షులకన్నా గొప్ప దంటే ఎలా?"

ఆ మాట ఆనందాన్ని గాయపరిచిం దనుకొంటాను, ముఖం కందగడ్డలా చేసుకొన్నాడు.

"ప్రవరుడికి ప్రేమించడం చాతకా దనుకోను. వరూధినిని గూడా అతను ప్రేమించే వుంటాడు. అత నామెను తిరస్కరించ డానికి, వరూధిని లోకోత్తర సౌందర్యమే కారణమనిపిస్తుంది. అంత గొప్ప అందాన్ని తనదాన్నిగా చేసుకోవడం ఇష్టం లేకనే అతను కాదని ఉండొచ్చు. తన కా అర్హత లేదన్న నిజాయితీయైన నమ్మకం గూడా - ఓ కారణం కావచ్చుకదా సుందరీ?"

"ఈ సంగతులేవీ, ఆ పుస్తకంలో లేవనుకొంటాను!"

"లేవుగాని, ఇలా అనుకోవడానికి అవకాశమున్నది గదా!" అన్నాడు ఆనందం.

"నాకెందుకో నచ్చలేదు మాస్టారూ!"

"ఇబ్బందిలేదు. ఆ సందర్భంలో, వరూధిని అలా ప్రవర్తించ డమూ, ప్రవరుడు అలా తిరస్కరించడమూగూడా సబబే! వాళ్ళ వాళ్ళ మనస్తత్వాలనుబట్టే ఆయా పాత్రలమీద అభిమానమో అసహ్యమో కలుగుతుంటాయి."

ఆనందం వెళ్ళిపోయాడు. తన హృదయం బాధతో మూలిగింది. ఏదో అవమానం, అపజయం పొందినట్టు తను ఫీలయింది. కానీ, ఒక విషయం మాత్రం తేలిపోయింది. ఆనందం మనస్తత్వం ఎలా ఉంటుందో చూచాయగా తనకు తెలిసింది.

రెండురోజులపాటు తను సుబ్బులొదిన ఇంటికేసి వెళ్ళలేదు. కావాలనే తనా పనిచేసింది. ఈలోపుగా అయిదారు సార్లయినా ఆనందం తనను గురించి సుబ్బులొదిన్ను అడిగాట్ట.

తను రాకపోవడం వల్ల ఆనందానికి ఏదో 'వెలితి' కనిపించి ఉండాలి అందుకే అడిగా డనుకొంది తను. మనిషి అనుకొన్నంత 'గుప్తం' కాదనిపించింది. అలా ఎందుకు సుబ్బులొదిన్ను అడిగావని ఆనందాన్ని అడిగితే. 'ఆఁ, ఊరికినే' అన్నాడు ఆనందం. కాదని తనకు తెలుసు. తనకు తెలిసిందే, అతనికి తెలిసి, అతని నోటినించి ఆ మాటకాస్తా వొస్తే, తనకిన్ని బెడదలే ఉండకపోను.

"మీరు పెళ్ళిచేసుకోరేం మాస్టారూ!" అన్నది తనొకసారి, ఆనందాన్ని ఒంటరిగా పట్టుకొని,

"నువ్వెందుకు చేసుకోవు?"

"ఎందుకు చేసుకోను?"

'ఎవర్ని?' అని అడుగుతా డనుకొంది తను. అడగలేదు. చివరికి తనే అనేసింది.

"చేసుకొంటే ప్రవరుణ్ని అభిమానించే వాళ్ళనే చేసుకొంటాను మాస్టారూ! వాళ్ళవల్ల అట్టే ఇబ్బందులుండవు. మెత్తగా రబ్బరుబొమ్మలా, ఎలాకావాలంటే అలా సాగుతారు. మరో యావా, రంధీ ఉండవు. హాయిగా జపంచేసుకొంటో, రుద్రాక్షలు తిప్పుకొంటో ఉంటారు."

ఆనందం ఏమీ అనలేదు. ఓసారి కళ్ళుమూసుకొని గట్టిగా నిట్టూర్చాడు.

ఆనందంలోని స్థాణుత్వం, తనను మరీ వెర్రిదాన్ని చేసి పారేస్తున్నది. అంతవరకూ ఎవ్వరూ నచ్చని తన తత్వానికి, ఆనందం ఇట్టే నచ్చాడు. అతని అందంకాదు ప్రధానం, అతనిలోని అమాయకత్వం, పసిపిల్లల మనస్తత్వం ముఖ్యం.

ఆనందాన్ని పెళ్లాడి, అతని బ్రతుకులో భాగం పంచుకొని, అతన్ని మామూలు మనిషిగా చెయ్యాలనిపించింది తనకు. అందుకోసం తనేమి చెయ్యడానికయినా సిద్ధపడింది. ఏమి కావడానికయినా సిద్ధపడింది. కారణం తనకీనాటికీ తెలీదు; తనపట్ల, నిర్లక్ష్యత లోకం వైపు మూసుకుపోయిన అతని మనోనేత్రాలు, అమాయకత్వం, గంభీరత - ఏవైనా కావచ్చు; ఇవన్నీ కాకనూ పోవచ్చు.

తను ఆనందాన్ని ప్రేమించింది. అతన్నితప్ప మరొకర్ని తను పెళ్ళాడలేదు. ఆడినా ఆ కొత్తవాడితో తను మనస్సు విప్పి మాట్లాడనూ లేదు. తన మనస్సునిండా, హృదయం నిండా, శరీరం నిండా ఆనందం నిండిపోయాడు. ఈ అవయవాలన్నీ ఆనందం కోసమే ఎదిగాయనీ, ఇవన్నీ అతని స్వంతమనీ, వీటినితాకే అర్హత - కనీసం చూసే హక్కుగూడా - ఇంకొకరికి లేదనీ, తను నిశ్చయించుకొంది. ఈ చేతులు, కాళ్ళు, కళ్లు, పెదిమలు, చెక్కిళ్లు మొత్తం శరీరం, అందులోని హృదయం, ఇవిమాత్రమే తనకున్నాయి. ఆనందాన్ని అర్చించడానికి' ఇవిగాక - అధికాధికమైన అవయవాలు ఇంకా బలం, అందం, ఉద్రేకం, తీవ్రత తనకుంటే ఎంత బావుండునో అనిపించింది. కానీ, భగవంతుడు మనిషికి, చాలా పరిమితంగా - ఇవి మాత్రమే ఇచ్చాడు.

నాన్న లేడు. అమ్మ, సుబ్బులోదిన, సరోజిని కార్యాని కెళ్ళారు. తను కావాలనే మానివేసింది. పదిమందిలో కన్నా ఒంటరిగా ఉన్నప్పుడు తనకు హాయిగా ఉంటుంది. మంచం మీద వెల్లికితలా

పడుకొని కళ్ళు మూసుకొంటే, సరోజిని దాని మొగుడు పీటల మీద కూచోవడం, మంత్రాలు, పాటలు... సరోజిన్ని బలవంతాన లోపలికి నెట్టి తలుపు వెయ్యడం, అది తలుపు దగ్గరే నిలబడటం, మొగుడొచ్చి చెయ్యి పుచ్చుకొని, చప్పున లాగితే, సరోజిని అలా తూలి, మొగుడు ఎదుర్రొమ్ము మీద పడటం, తప్పదని తెలిసీ, తప్పుకొందుకు సరోజిని చేసే వ్యర్థ ప్రయత్నం, దీపం కనుమరుగు కావటం - గుసగుసలు, గాజుల చప్పుడు, చిట్లిన ధ్వని, నిశ్శబ్దమైన మూలుగు-

ఆలోచన తెగి, చివాలున కూచుంది. మనస్సంతా వెర్రెత్తినట్టుంది. ఒంటరిగా ఉండటానికి భయం. పోనీ ఆనందంతో కబుర్లాడుతూ కూచుంటే... లేచి రెండడుగులు వేసింది. ఆనందానికి తెల్లచీరలంటే ఇష్టమని సుబ్బులొదిన చెప్పింది. పరికిణీ విప్పేసి తెల్లచీర కట్టుకొంది. నల్ల ముఖమల్ జాకెట్ తొడుక్కుంది. తలుపుకు గొళ్ళెం పెట్టి ఆనందం దగ్గర కొచ్చింది.

ఆనందం ఒంటరిగా ఉన్నాడు. వెర్రెత్తిన మనస్సు కుదుటపడటానికి మారు, మరింత కల్లోలమయింది. ఆనందం మంచం మీద కూచున్నాడు. తను తక్తాబల్ల మీద కూచున్నది. వంటి నిండా ఆవేశం, ఏదో బాధ, వత్తిడి, ఇరుకు - విశాలంగా ఉన్న చోట నేలమీద పడి దొర్లాలనీ, పెద్దగా అరవాలనీ, జుట్టు విరబోసుకొని - అలిసిందాకా గెంతాలనీ, శరీరాన్ని గట్టిగా నొక్కి, అణచి విరిచి, మెలి తిప్పి లోపలి బాధనుండి తప్పుకోవాలనీ, బాణంలా రివ్వున దూసుకు పోవాలనీ ... అవీ, ఇవీ ... ఇంకా ఇంకా ... చాలా, చాలా ...

మబ్బులు పట్టి, చీకట్లుకమ్మి, గాలి చల్లబడి, శరీరంలో దూరి కితకితలు పెడుతోంటే, తనే వెళ్ళి కిటికీ తలుపులు వేసింది.

ఆనందం శరీరం తనకు తగిలినప్పుడు గొప్ప మెరుపు, వంటినిండా ఉద్రేకపు పరద, చెవుల్లో హోరు, గొంతులో అణగిన ఆనందం- ఇలానే, తనను అనుకొని శాశ్వతంగా వుండి పోగూడదా - ఈ ఆనందం! అతని భుజం మీది తన చెయ్యి, భుజాన్ని దగ్గరకు లాగుతోంటే ఆనందం పాములా జారి పోయాడు ... లోపలేవో నాగులు పడగలు సాచి బుసలు కొడుతున్నట్టు, కసిగా మసగలాడినట్టు - చీకటి హోరుగాలి, వంటరితనం, ఎదట ప్రేమించిన ఆనందం, లోపల కావలసినంత వాంఛ, అవకాశం, తొందరపాటు, వెల్లువ ... సరోజిని, మొగుడు గదిలో పెనుగు లాట, మెలికలు, నరాల చిట చిట, రాలిన పూలరేకులు ...

దీపం వెలిగించ మన్నాడు ఆనందం. తను తడుము కొంటూ వెడుతుంటే, ఆనందం అడ్డు పడ్డాడు. తను అడుగు ముందుకెయ్య లేక పోయింది. అతన్ని, తన ఆనందాన్ని, దేవుణ్ణి, ప్రాణాన్ని, చిన్నని, దగ్గరగా తీసుకొని లాలించి, కరగించి, దోసిళ్ళతో తాగి, వంటినిండా నింపుకొని, మెత్తని మబ్బులో, ఆ సమయంలో ఏటి వంపు ఉరవడిలో, గడ్డి లావణ్యంలో, యోగి చిరునవ్వులోని ఏ కోరికలూ, ఉద్రేకాలు, ఆవేశాలు లేకుండా తృప్తిగా, హాయిగా, నవ్వుతో, చచ్చిపోవా లనిపించింది.

కానీ ఆనందం, పెనుగులాడి, వొంచి, నొక్కి, కరిచి, దూరంగా పోయాడు, తనను పరాభవించి, అవమానించి. అతని అతనికోసం గదంతా వెదికింది. దొరికితే, గొంతు కొరికి, నెత్తురు జిమ్మేన పీల్చిఉండేదేమో తను! తనకే బలముంటే, ఆనందం వేసిన తలుపు బద్దలుకొట్టి, అతనిమీదికి దూకి, సింహంలా చీల్చి, చెండాడి వుండేదేమో!

ఏమయ్యేదో తెలీదు. తనకాబలం లేకపోయింది. తన నిస్సహాయతకు, బలం లేమికి, ఏడుపొచ్చింది. తనలా వెక్కి వెక్కి

ఏడుస్తోంటే, ఆనందం బైటినుంచి ఏదో వాగుతున్నాడు. ఇంకొక్క క్షణం ఆ గదిలో ఉండబుద్ధిగాలేదు. నాలుగు గోడలూ, తన అవమానాన్ని దిశాంతాలకు చాటి చెబుతున్నట్లనిపించింది. దొడ్డితలుపు తీసుకుని ఇంటి కొచ్చేసింది...

"ఏమిటి సుందూ, అలా ఉన్నావ్?"

అమ్మకు జవాబు చెప్పలేదు. ఏమని చెబుతుంది? ఆనందం అవమానించాడనా? ఆశలు రాలిపోయాయనా? జడుణ్ని, అధముణ్ని నీచుణ్ని, మూర్ఖుణ్ని - గొప్పవాడనీ, మహోన్నతుడనీ నమ్మి, ప్రేమించి, సర్వస్వం ప్రోదిచేసి పాదాక్రాంతం చేస్తే, కాంక్షించి ముఖాన ఉమ్మి, కాలితో నెట్టాడనా ?

ఆ రాత్రల్లా తను ఏడుస్తూనే ఉంది. లోపలినించి సెగలూ పొగలూ రేగి, ఈ లోకాన్నంతా మసిచేస్తాయేమో ననిపించింది తనకు. ఆలోచనలు ఉసుళ్ళలా రేగి - మనస్సును పొడుస్తుంటే, గిలగిల్లాడి - తనలో తనే తన్నుకొని, అలసిపోయింది ...

ఇది ఆనందం తప్పుకాదు. తన తప్పే! రాయిని చూసి రత్నమనుకొంది లోపలన్నా రత్నశకలం ఉండకపోతుందా అనుకొంది లేదు - ఉత్త గులకరాయి! దాన్ని చూసి భ్రమించడం తనదే తప్పు. రాయిని నిందించి ప్రయోజన మేమిటి?

ఓ విధంగా ఆనందం తిరస్కరించడమే మంచిదేమో! అలాంటి శిలకు, తన జీవనపుష్పం ఆహుతి కాలేదు. అదే జరిగినట్లయితే, బ్రతుకంతా ఆ శిలను చూసి, తను విచారించవలసి వచ్చేది. తెలిసో తెలియకో ఆనందం మంచిపనే చేశాడు. ఇప్పుడు ఒక్క రాత్రే విచారం. అప్పుడు బ్రతుకంతా విచారమే!

ఏదో ఓదార్పుకోసం ఇప్పుడిలా అనుకోడం గానీ, ఆనందం నిజంగా తనను స్వీకరించితే ఏమయ్యేది ? అలా కావాలనే గదా తన తపస్సంతా ! కాలేదనే గదా ఇప్పుడిలా కంటికీ మంటికీ ఏడుస్తున్నది ! కొద్ది గంటల క్రితం వరకూ మహోన్నతుడుగా కనిపించిన ఆనందం, ఇప్పుడు అధముడు నీచుడు కావడం చిత్రం కదూ !

కానీ, తను అనుకొన్నదే నిజం ! తనను స్వీకరించలేదు గనుకనే జడుడు. స్వీకరిస్తే మహాత్ముడే !

కాలం అన్నిటినీ సర్ది పెడుతుందని, తనకు అనుభవం మీద తెలిసొచ్చింది. కొన్ని సంఘటనలను సమూలంగా దాచేస్తే, మరి కొన్నింటిని పలచని పొరల కింద కప్పి పెడుతుంది. ఆనందం... అతన్ని ప్రేమించడం ... ఆ రాత్రి సంఘటన ... అన్నీ క్రమంగా దూరంలోకి జరిగి, మసక మసగ్గా, మినుకు మినుకుమంటూ మిగిలి పోయాయి ...

తనకు పెళ్ళయింది. ఆ పెళ్ళిలో కేవలం తను నిమిత్త మాత్రురాలు. మొగుడిపట్ల అభిమానమూ లేదు. అసహ్యమూ లేదు. కావాలనుకున్న ఆనందం దూరమయ్యాక, ఎవరైతేనేం అనిపించింది. ఆనందంమీద కసితో, కోపంతో, అసహ్యంతో, తనా భర్తను కట్టుకొంది. భర్త తనను కౌగలించు కొన్నప్పుడు, అతని చేతుల్లో నలుగుతున్నప్పుడు, ఆనందం ఓడిపోయాడనీ, తను దిగ్విజయం సాధించాననీ, ఓ తృప్తి లీలగా మెదిలి నిద్రపోయేది. అదయినా, ఆ కొద్ది నిముషాలే !

తను భర్తను ప్రేమించలేదనే అనుకోవాలి. అతను మాత్రం తనంటే ప్రాణాలు విడిచేవాడు. తన కేవేవి ఇష్టమో ఎలా వుంటే బావుంటుందో, అలానే ఉండేవాడు. కానీ, తను మాత్రం అతనికి

న్యాయం చేయలేక పోయింది. ఎక్కడో దూరంగా, అస్పష్టంగా, ఆనందం మెదిలి - తనకు తృప్తినీ, సుఖాన్నీ లేకుండా చేశాడు

అయినా, తనెప్పుడూ బైట పడలేదు. తన లోలోపలే దాచుకుని, కుమిలి కుమిలి పోయింది. తన బ్రతుకంతా చేదుతో నిండిపోయింది ...

ఏది దక్కలేదు. ఆ భర్తా పోయాడు. అమ్మా నాన్నా పోయారు. ఆస్తీ పోయింది. సర్వస్వం ఊడ్చిపెట్టుకు పోగా, ఆనందం తాలూకు జ్ఞాపకాలూ, తన అందమైన శరీరమూ మిగిలాయి. అన్నిటికి ఇబ్బంది - తిండికి, గుడ్డకు, ఉంటానికి, నడవటానికీ, నడవక పోవటానికీ, నిద్రకూ - అన్నిటికీ బాధలే !

భర్తకోసం, అతని తృప్తికోసం శరీరాన్నిచ్చింది ఇష్టముండి కాదు. భర్త గనక; తనకు తిండి, గుడ్డ ఇస్తున్నాడు గనక. ఇంకా ఈ శరీరంమీద మోజు పడుతున్న వారున్నారు. పదులూ, పాతికలూ ఇవ్వగలవా రున్నారు. ఏం? భర్త కిచ్చిన అసంతృప్తితోనే, అవే ఫలితాలకోసం మరొకరి కెందుకివ్వ గూడదు ?

నాలుగేళ్ళు గడిచాయి. ఈ నాలుగేళ్ళలో అన్నిటిమీదా అసంతృప్తి. పరిస్థితులతో రాజీపడలేక పోవటం, జీవితం మీద అనాసక్తత, చిరాకు, కోపం, తీర్చుకోలేని కసి, అపజయ భారం, రుగ్మత మాత్రం మిగిలాయి. విసుగెత్తి, కొన్ని రోజులయినా వాటన్నిటికీ దూరంగా, హాయిగా, ప్రశాంతిగా గడుపుదామని, ఈ ఆశ్రమాని కొచ్చింది. ఇక్కడ మళ్ళీ ఆనందం ప్రత్యక్షమయ్యాడు !

ఇంత కాలమూ, అతనెక్కడో సుఖంగా ఉంటున్నాడనే తను అనుకొంది. ఎవత్తెతోనో కాపరం చేస్తూ, పిల్లలను కంటూ,

డబ్బు కూడబెడుతూ ఉండి ఉంటాడనుకొంది. ఆ భావనలే, అతని మీద కసికీ, కోపానికీ, అసహ్యానికీ కారణమేమో! ఆనందాన్ని చూశాక, అతనూ బ్రతుకుతో బాగా నలిగిపోయా డనిపించింది. ఈ సత్యం తన కిదివరకే తెలిసి ఉంటే, తన జీవితంలో ఇంత చేదు, ఇంత దుమ్ము ఉండేది కాదేమో!

ఏది ఏమైనప్పటికీ తన బ్రతుకిలా దగ్ధం కావడానికి ఆనందమే కారణం! ఆ నాడు, ఆ వానరాత్రి, ఆనందం అంత మూర్ఖంగా, శిలగా ప్రవర్తించి ఉండక పోతే తన బ్రతుకూ, అతని బ్రతుకూ మరో విధంగా ఉండేవి. కొన్ని క్షణాలు — అవును — క్షణాలే — జీవితంలో ఎంత గొప్ప మార్పులు తీసుకొస్తాయో చెప్పడానికి తన బ్రతుకొక్కటీ చాలు ...

ఇన్ని సంవత్సరాల తర్వాత ఈ రూపంతో, ఈ మాటలతో ఆనందం తన దగ్గరి కొస్తాడని తను ఊహించనన్నా ఊహించలేదు. అతనికి ఈనాటికి తను కావలసి వచ్చింది. ఆనాడు తనకు ఏమీ తెలీదనీ, చాదస్తపు సిద్ధాంతలను విశ్వసించి మూర్ఖంగా ప్రవర్తించా ననీ, ఆనందం మొత్తుకుంటున్నాడు. పసివాడిలా బావురుమన్నాడు. గుండెలు భగ్గుమని మండి, ఆ మంటల్లో శరీరమంతా మాడిపోక ముందే అతన్ని తిట్టి, నెట్టి దూరంగా తోలేసింది. కన్నీటితో కరిగి పోతున్న అతని కళ్ళకేసి చూసినప్పుడు, నిరాశతో జీవచ్ఛవంలా తూలుకొంటూ పోతున్న అతని నీడను చూసినప్పుడు, పెళిల్లున బ్రద్దలవ్వకుండా తన గుండెలు ఎలా నిలచి ఉన్నాయో ఆశ్చర్యమే!

ఒకప్పుడు ఈ ఆనందం కోసం, అతని చూపుకోసం, స్పర్శ కోసం, మాటకోసం, కౌగిలికోసం, కలలుగని, తపించి విలవిలలాడి పోయింది తను. ఇతనికే తన సర్వస్వాన్నీ అర్పించడానికి సిద్ధ

పడింది. ఇతని పాదాలముందు శిరస్సునుంచి, నిర్మలత్వంతో, నిరీహతో, నిశ్శబ్దంగా ప్రాణాలివ్వడానికి ఉద్యుక్తురా లయింది. ఇతని జ్ఞాపకాలతోనే బ్రతుకంతా నింపుకొని కాలం గడిపింది. అటువంటి ఆనందం ఈనాడు తన దగ్గరకు భిక్షాపాత్ర పట్టుకొని వచ్చాడు. బిచ్చానికి బదులు దుమ్ము చిమ్మింది. ఆనాడు వాన రాత్రి - ఆనందం తనను తిరస్కరించినప్పుడు తనెంత బాధపడిందో తన కీనాటికీ జ్ఞాపకముంది. అటువంటి బాధే, అటువంటి యమ యాతనే ఇప్పుడు ఆనందం గూడా అనుభవిస్తుంటాడు. ఒకనాటి తన వేదనకు ఆనందం కారణం కాగా ఈనాటి అతని రోదనకు తనూ కారణం!

రోషంతో, కోపంతో, తను ఆనందాన్ని తరిమేసింది. ఈ నాటికయినా అతను తన దగ్గర కొచ్చాడన్న సంతృప్తిని తను పొందలేక పోయింది. నిజంగా తను ఆనందాన్ని ప్రేమించడమే జరిగితే, తన ప్రియుణ్ణి తనే చేజేతులా వెళ్ళగొడుతుందా? అజ్ఞాన దశలో అతను చేసిన ఒక్క తప్పును క్షమించలేదా? తను ఆనందాన్ని ప్రేమిస్తున్నదా? పగ దీర్చుకొంటున్నదా?

ఒకప్పుడేమోగానీ, ఇప్పుడీ శరీరం ఖరీదు పది రూపాయలు. ఎందరి చేతుల్లోనో నలిగిపోయిందిది. ఎందరి దాహార్తులకో దాహోప శమనం చేసింది. వేలు సంపాదించింది. అన్నీ వెచ్చించింది. నైతికంగా దీనికున్న విలువ ఏమిటో తను చెప్పలేదు.

కానీ, దీనికే ఆశించి తన ఆనందం వచ్చాడు. కన్నీటితో తనను అర్థించి, తిరస్కృతుడై వెళ్ళిపోయాడు. ఒకప్పుడు తనంత తానుగా అతని దగ్గర కెళ్ళిన శరీరం, శాశ్వతంగా అతనికే అంకితం కావలసిన శరీరం, పది రూపాయల విలువచేసే శరీరం, తను తన

స్వామికి ఇవ్వలేక పోవడంకన్నా అధమత్వం, నీచత్వం, కఠినత్వం ఇంకేముంటుంది ?

చివాలున లేచింది సుందరి. గోళ్ళతో జుట్టు దువ్వుకొని, వేలుముడి వేసుకొంది. మూటలోంచి అద్దం తీసింది. పౌడరు తీసింది. తిలకంసీసా తీసింది. కాటుకడబ్బీ తీసింది. చక్కగా ముస్తాబయ్యింది. అద్దంలో చూసి, ఓసారి తన ముఖాన్ని తనే ముద్దుపెట్టుకొంది. దీపం తగ్గించింది. తలుపు దగ్గరగా వేసి, ఆనందస్వామి గదిదగ్గర కొచ్చింది. క్షణకాలం నిలబడి దీర్ఘంగా నిట్టూర్చింది. తనలో తానే నవ్వుకొంది.

చంద్రుడు కొండవెనుక మునిగి పోయాడు. చుక్కలు కళ్ళార్పుతూ, కేరింత లాడుతున్నాయి. దూరంగా ఎడ్లమెడల్లోని గంటలు మోగుతున్నాయి చల్లగాలి తెరలు తెరలుగా వీస్తోంది. తూర్పుదిశన వెలుగు తెరలు జీరాడుతున్నాయి,

"స్వామీ !"

అంటూ సుందరి మెల్లగా తలుపు తీసుకొని లోపలికొచ్చింది. ఓ మూల దీపం 'జేగంట' లా వెలుగుతోంది. గదిమధ్య కొచ్చి చుట్టూతా చూసింది సుందరి. ఆనందస్వామి మంచం ఖాళీగా ఉంది! తలగడమీద చిన్న కాయితం మడత గాలితాకిడికి ఉండి ఉండి పాము పడగలా తలెత్తుతోంది ! !

"స్వామీ !"

తన శక్తినంతా కూడదీసుకొని, గొంతులో ప్రోది చేసి, అన్ని ప్రాణాలనూ రంగరించి కంఠనాళాలు చిటిలి పోయేలా బిగ్గరగా అరచింది సుందరి.

ఆనందస్వామి మంచంమీద కుప్పగా కూలిపోయిన సుందరి శరీరం, నాగుకాటుతిన్న చూడిలేడిలా విలవిలా తన్నుకొంటుంటే, ఆమె లోలోపలి ఆలోచనలు, కోరికలు, కలలు, ఆశలు, ఆవేశలు, అనుభూతులు, శక్తులు, సర్వస్వమూ రెక్కొని - తీవ్రంగా విస్తరిల్లి ఆర్తనాదంలో కలిసి - గాలిలో తేలి పోయాయి.